

నిష్పక్షపాతం.. సత్యనిష్ఠ..
అంకితభావం..
ప్రజల మేలు కోసం చూపే తెగువ
పత్రికలకు అవశ్యం.

# ఆంధ్రపత్రిక

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం 1914

విశాఖపట్నం సంపుటి : 60 సంచిక : 24 • పేజీలు : 8 • గురువారం 24 అక్టోబరు 2024 • వెల : రూ. 5.00

Published from : Vijayawada | Visakhapatnam | Srikakulam | Rajahmundry | Kurnool | Guntur | Ongole | Nellore Tirupati


- దీపావళి నుంచి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు
- నాలుగు నెలలకు ఒక సిలిండర్ ఇవ్వాలని నిర్ణయం
- ఉచిత ఇసుక సీనరేజ్, జీఎస్టీ ఛార్జీల రద్దు..
- ఇసుక అక్రమంగా విక్రయిస్తే పిడి యాక్ట్
- కొరత ఉన్న ఐదు జిల్లాల్లో ఇసుక పాయింట్ల ఏర్పాటు
- నిరంతరం సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ ఉండాలి
- విశాఖ శారదాపీఠం భూముల కేటాయింపు రద్దు
- ఆలయ కమిటీల్లో బ్రాహ్మణులు, నాయీ బ్రాహ్మణులకు చోటు
- ఉచిత ఇసుకను ఇతర సరిహద్దు రాష్ట్రాలకు తరలించకుండా చెక్‌పోస్టులను బలోపేతం చేస్తాం
- ఎపి కేబినేట్ భేటీలో కీలక నిర్ణయాలు



# మహిళలకు దీపావళి కానుక

## మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి మంత్రివర్గం ఆమోదం

**అమరావతి,అక్టోబరు 23 (ఆంధ్రపత్రిక):** దీపావళి నుంచి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చేందుకు ఎపి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నగదు చెల్లించి సిలిండర్ కొనుగోలు చేస్తే.. 48 గంటల్లో తిరిగి అకౌంట్‌లో నగదు జమయ్యేలా చూడాలని నిర్ణయించారు. ఒకేసారి మూడు సిలిండర్లు తీసుకోకుండా ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్ ఇవ్వాలని నిర్ణయించారు. ఈ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై ఏడాదికి రూ.2700 కోట్ల భారం పడుతుందని మంత్రివర్గంలో చర్చ జరిగింది. ఉచిత ఇసుక విధానంలో సీనరేజ్, జీఎస్టీ ఛార్జీల రద్దుకు మిగతా 7లో

# ఉగ్రవాదంపై మనమంతా పోరాడాలి

- ద్వంద్వ ప్రమాణాలకు తావీయరాదు..
- పరోక్షంగా చైనాను ఉద్దేశించి మోదీ వ్యాఖ్యలు
- సరిహద్దు గస్తీ ఇరు దేశాల మధ్య ముందడుగు
- ఉగ్రవాదం అనేది చాలా తీవ్రమైన సమస్య..
- బ్రిక్స్ సదస్సులో భారత్, చైనా చర్చలు
- జిన్‌పింగ్‌తో ప్రధాని మోదీ చర్చలు



**మాస్కో,అక్టోబరు 23 :** ఉగ్రవాదంపై పోరుకు యావత్ ప్రపంచం ఏకతాటిపై నిలవాలని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. దీనిపై ద్వంద్వ ప్రమాణాలకు తావీయరాదని పరోక్షంగా చైనా తీరును ఎండగట్టారు. కజాన్‌లో జరుగు తున్న 16వ బ్రిక్స్ సదస్సు ముగింపు సమావేశంలో మోదీ మాట్లాడుతూ, ఉగ్రవాదం అనే తీవ్ర సమస్యను మిగతా 7లో

# మిస్టరీగా హసీనా 'రాజీనామా లేఖ'



**న్యూఢిల్లీ,అక్టోబరు 23 :** బంగ్లాదేశ్‌లో విద్యార్థుల ఆగ్రహానికి గురైన షేక్ హసీనా ప్రధాన మంత్రి పదవికి రాజీనామా చేసి దేశం వీడాల్సి వచ్చింది.అక్కడ తాజాగా మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే, ఈసారి మాత్రం దేశాధ్యక్ష పదవి నుంచి మొహమ్మద్ షహాబుద్దీన్ వైదొలగాలని డిమాండు చేస్తూ అధ్యక్ష భవనం 'బంగాభబన్'ను ఆందోళనకారులు చుట్టుముట్టారు. ఇందుకు మిగతా 7లో

# బాంబు బెదిరింపులు..

- సోషల్‌మీడియా సంస్థలపై కేంద్రం ఆగ్రహం




**న్యూఢిల్లీ,అక్టోబరు 23 :** దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులకు బాంబు బెదిరింపు హెచ్చరికలకు తెరపడటం లేదు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కొద్దిరోజులుగా విమాన యాన సంస్థలకు వస్తున్న బాంబు బెదిరింపులు అందరిని షాక్ గురిచేస్తున్నాయి.దాదాపు మిగతా 7లో

# వయనాడ్ ప్రజలు నా కుటుంబ సభ్యులే..

- వారికి సేవ చేసేందుకే ఇక్కడికి వచ్చా..
- రాజకీయాల కోసం ఇక్కడి రాలేదు
- వయనాడ్ ర్యాలీలో ప్రియాంక వెల్లడి

7లో





# అన్ని విద్యల్లో కన్నా వేద విద్య ఉన్నతమైనది..

7లో

- వేదాలు అభ్యసించే విద్యార్థులకు స్వరూపం, స్వధర్మం, స్వభావం ముఖ్యం
- ధర్మాన్ని తెలుసుకోవాలంటే వేదాలను తెలుసుకోవడం తప్పనిసరి

# జగన్ తీరు మారాలి

- కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మే ప్రయత్నం
- జగన్ పాలనలో మహిళలపై విపరీత దాడులు
- మంత్రి అనగాని సత్యప్రసాద్



**అమరావతి,అక్టోబరు 23 (ఆంధ్రపత్రిక):** ఎన్నికల్లో ఘోరపరాజయంతో పరాభవంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి జగన్ గుడ్డెద్దు మిగతా 7లో

# ఎపికి మరిన్ని పెట్టుబడులు రావాలి..

- ఎపిలో పెట్టుబడులకు కొరియా సంస్థల ఆసక్తి
- రాష్ట్రంలో పెట్టుబడుల అనుకూల వాతావరణం



**అమరావతి, అక్టోబరు 23 (ఆంధ్రపత్రిక):** రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పనే లక్ష్యంగా విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ ముందుకు సాగుతున్నారు. సీఎం చంద్రబాబు సమర్ధ నాయకత్వంపై విశ్వాసంతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు దక్షిణ మిగతా 7లో

# సూపర్ సిక్స్‌లో తొలి అడుగు



- 48 గంటలలోపే అకౌంట్‌లోకి డబ్బులు
- మంత్రి నాదెండ్ల మనోహర్

**అమరావతి, అక్టోబరు 23 (ఆంధ్రపత్రిక):** 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు సూపర్ సిక్స్ లో భాగంగా తొలి అడుగు. మహిళాసాధికారత లో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్లు మిగతా 7లో

# ఎపి సర్కార్ కీలక నిర్ణయం

- ఏపీపీఎస్సీ ఛైర్‌పర్సన్‌గా అనురాధ
- ఉత్తర్వులు జారీ చేసిన ఎపి ప్రభుత్వం
- ఎపి క్యాడర్‌కు చెందిన అనురాధను నియమించిన ప్రభుత్వం



**అమరావతి,అక్టోబరు 23 (ఆంధ్రపత్రిక):** ఏపీ సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ మిగతా 7లో

# రేపటికి తీవ్ర తుపానుగా దానా..!



- గంటకు 15 కి.మీ వేగంతో ముందుకు..- తుఫాన్ హెచ్చరికలతో అప్రమత్తమైన రైల్వేశాఖ - మూడు రోజుల పాటు పలు రైళ్లు రద్దు.. - ఈరోజు 17, రేపు 26,ఎల్లుండి 7 రైళ్లు రద్దు - విశాఖ రైల్వేస్టేషన్‌లో హెల్ప్‌లైన్ డెస్క్ ఏర్పాటు

**అమరావతి,అక్టోబరు 23 (ఆంధ్రపత్రిక):** తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన 'దానా' తుపాను రేపటికి తీవ్ర తుపానుగా రూపాంతరం చెందుతుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాములోపు తీరం మిగతా 7లో



# వైసిపి మరో షాక్..

- మహిళా నేత వాసిరెడ్డి పద్మ రాజీనామా
- గుడ్ బుక్ పేరుతో మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారు..
- కార్యకర్తల కోసం గుడ్ బుక్ కాదు..గుండె బుక్ కావాలి

**విజయవాడ,అక్టోబరు 23 (ఆంధ్రపత్రిక):** వైసిపికి మరో షాక్ తగిలింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత పలువురు మిగతా 7లో

# జగన్ కుటుంబంలో మరోసారి ఆస్తి వివాదం?





- మాజీ సిఎం వైఎస్ జగన్ సంచలన నిర్ణయం..
- ఆస్తి కోసం విజయమ్మ,షర్మిలపై పిటిషన్లు..!
- సంచలనంగా మారిన వైఎస్ జగన్ ఫిర్యాదు..
- సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ షేర్ల వివాదం..

**అమరావతి, అక్టోబరు 23 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం జగన్ కుటుంబంలో మరోసారి ఆస్తి వివాదం తలెత్తింది. తన తల్లి వైఎస్ విజయమ్మ, సోదరి వైఎస్ షర్మిలపై జగన్ మోహన్ రెడ్డి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్‌లో మిగతా 7లో



ఒరులేయని యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్

ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

# మరుపు

జ్ఞాపకం ఒక శక్తి! దానిని నిలబెట్టుకోవడం,పెంచుకోవడం,పంచుకోవడం ఒక కళ!అది ఒక వరం. దీనికి పూర్తి వ్యతిరేకమైనది మతిమరుపు.అదొక పెద్ద శాపం!వయసు పెరిగేకొద్దీ జ్ఞాపకశక్తి తగ్గడం,మతిమరుపు పెరగడం సహజమైన జీవచర్యగా భావించినా,దానిని అలావదల కూడదు.వృద్ధాప్యం వల్ల శారీరకమైన రుగ్మతలు వచ్చినాజ్ఞాపకశక్తిని అద్భుతంగా కాపాడుకున్నవారు మన మధ్యనే ఎందరో ఉండేవారు,ఇప్పటికీ ఉన్నారు.వారే మనకు ఆదర్శం.సివిల్ సర్వీసెస్ లో అఖిల భారత స్థాయి పోటీల్లో గెలిచి అద్భుతమైన ర్యాంకులు తెచ్చుకొని ఐఏఎస్ అధికారులుగా పెద్ద పెద్ద బాధ్యతలు నిర్వహించి,అల్జీమర్స్ బారినపడి బాధపడుతున్నవారు కూడా మన మధ్యనే ఉన్నారు.వీరి జీవితాలు,వారితో పెనవేసుకొన్నవారి కుటుంబ సభ్యులు వేదనామయమైన జీవితాన్ని గడుపుతున్నారు.మరుపురాకుండా చూసుకోవడం,జ్ఞాపకశక్తిని పెంచుకోవడం మన చేతుల్లోనే ఎక్కువశాతం ఉందనివైద్య శాస్త్రవేత్తలు,మానసికవైద్య శాస్త్ర నిపుణులు కూడా చెబుతున్నారు.మన ఆరోగ్య పరిరక్షణలో ఏమాత్రంమరువకూడని అంశం 'జ్ఞాపకశక్తి'. నిన్నటి వరకూ మన మధ్యనే ఉన్న'కళాతపస్వి' కె విశ్వనాథ్,'అపరగంధర్వుడు' మంగళంపల్లి బాలమురళీకృష్ణ,పూర్వ ప్రధాని పీవీ నరసింహారావు అమోఘమైన జ్ఞాపకశక్తిని చివరివరకూ నిలుపుకున్నారు.వీరిలో మంగళంపల్లివారిది ఇంకా విశేషమైన ఆరోగ్యం.వీరికి అనారోగ్యాలు సోకిన దాఖలాలు కూడా పెద్దగా లేవు.వీరి గురించే ప్రత్యేకంగా ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే?వారు మన తెలుగువారు. ఎనిమిదిపదుల వయస్సు మించి జీవించినవారు.నేటి కుర్తాళ పీఠాధిపతి సిద్ధేశ్వరానందభారతి (పూర్వాశ్రమ డాక్టర్ ప్రసాదరాయకులపతి)కిఇప్పుడు 87ఏళ్ళ వయస్సు.ఇప్పటికీ కొన్నివేల పద్యాలు,శ్లోకాలు,స్తోత్రాలురసనాగ్రంపై నాట్యం చేస్తూ ఉంటాయి. ఆయన పుస్తకాలు చదవడం మానేసి కూడా 60ఏళ్ళు దాటిపోయింది.వీరే కాదురామ్ జెత్మలానీ ,శ్రీపాద పినాకపాణి వంటివారు కూడా అటువంటివారే. వీరు దాదాపు 100ఏళ్ళు అద్భుతమైన జ్ఞాపకశక్తితో జీవించారు.సుమారు65 ఏళ్ళ వయస్సు నుంచి మతిమరుపు పెరిగే అవకాశాలు ఉన్నాయని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి.ఒక్కొక్క నివేదిక ఒక్కొక్క రకంగా చెబుతున్నప్పటికీ మతిమరుపువిషయంలో,జ్ఞాపకశక్తిని పెంచుకోవడం అంశంలో అయిదుపదుల వయస్సు నుంచే సాధన చేయడం ఉత్తమం. అధికరక్తపోటు,మధుమేహం,కొలెస్ట్రాల్ వంటివాటి వల్ల రక్తనాళాలు దెబ్బతినడం,మెదడుకురక్తం సరిగ్గా సరఫరా కాకపోవడం, ప్రాణవాయువు సక్రమంగా అందకపోవడం వల్ల మతిమరుపుబారినపడే ప్రమాదం ఉందని వైద్యులు చేస్తున్న హెచ్చరికలను గౌరవించి,వారు సూచించినట్లుగాపాటించాలి.శారీరకమైన రుగ్మతలకు మందులు వేసుకుంటూ,వ్యాయామం చేస్తూ,నడక సాగిస్తూ ఉండడం ముఖ్యం.అట్లే యోగ సాధన,ప్రాణాయామం,ఓంకారం,ధ్యానం వంటివాటిని కూడా కలిపి సాగాలి.అదే సమయంలో అతిగా ఆందోళన పడడం,క్రుంగుబాటు వంటివి ఇంకా ప్రమాదం.పొగతాగడం,మధ్యపానం వంటివాటికి దూరమవ్వడంఎంత ముఖ్యమో వంటరితనానికి దూరమవ్వడం కూడా అంతకంటే ఎక్కువ ముఖ్యం.మనిషిని 'సోషల్ యానిమల్ ' అంటారు. జనంతో,జనం మధ్య ఉండడం ,స్నేహితులు,ఆత్మీయులు,బంధువులను తరచూ కలవడం, వారితో గడపడం గొప్ప ఆరోగ్యాన్ని కలుగజేస్తుందని నిపుణులు చెప్పేమాటలు ఎంతో విలువైన మాటలు.తమను తాముఎప్పుడూ బిజీగా ఉంచుకోవడం,మెదడును పదునుపెట్టే వాటిలో సమయం గడపడం చాలా చాలా ముఖ్యం.ఇది అన్ని వయసులవారికీ వస్తుంది.ముఖ్యంగా 60దాటిన వారికి మరీ ముఖ్యం. మెదడును బాగా సద్వినియోగం చేయడం ఎంత ముఖ్యమో,మెదడుకు తగిన విశ్రాంతి ఇవ్వడం కూడా అంతే ముఖ్యం.వైద్యుల సలహాల మేరకు ఆహారాన్ని తీసుకోవడం,నిద్రలోనూ సమయపాలన పాటించడం కీలకం.వేదకాలంనాటి భారతీయ విద్యా విధానం చాలా గొప్పది. జ్ఞాపకశక్తినిచాలా చురుకుగా ఉంచేలా ఉండేది.గురువులు చెప్పింది వినడం,మెదడులో ధరించడం,వల్లెవేయడం,తిరిగి అప్పచెప్పడం.. ఇలా అంతా మౌఖికంగా సాగేది. తెలుగువారి'అవధాన విద్య' కూడాఈ సూత్రాలపైనే నిర్మాణమైంది.పద్యాలను ధారణ చేయడం వల్ల జ్ఞాపకశక్తి బాగా పెరుగుతుంది.పలకడం ద్వారా జరిగే చర్య ద్వారా రక్తప్రసరణ,ఆక్సిజెన్ ప్రవాహం బాగా జరుగుతాయి.ఈ సాధన విద్యార్థుల నుంచి వృద్ధుల వరకూ ఉపయోగపడుతుంది. ఆటలు,పాటలు శారీరక,మానసిక ఆరోగ్యాన్ని తీర్చిదిద్దేవే.మన విద్యావిధానంలో నిన్నమొన్నటి వరకూ ఉన్నాయి. కొన్నాళ్ళుగా అవి సన్నగిల్లాయి. ఇప్పుడిప్పుడే నూత్న విద్యా విధానం వాటిపై దృష్టి సారిస్తోంది. మొత్తంగా చూస్తేమతిమరుపు రాకుండా చూసుకోవడం,జ్ఞాపకశక్తిని పెంచుకోవడం చాలా వరకూమన చేతుల్లోనే ఉంది.

# కుటుంబ రాజకీయాలు

భారత రాజకీయ వ్యవస్థ మొత్తం కుటుంబ రాజకీయాలకు ఆలవాలంగా ఉంటోంది. కుటుంబ రాజకీయాలకు దూరంగా ఉండాలన్న కల సాకారం కావడం లేదు. కాంగ్రెస్‌లో కుటుంబ రాజకీయాలు పెనవేసుకు పోయాయి. అలాగే ప్రాంతీయ పార్టీల్లో ఇది మరీ ఎక్కువగా ఉంది. ఒక్క కుటుంబంలో ఎంతమంది ఉంటే అందరూ రాజకీయాల్లో ఉండాలనుకుంటున్నారు. తాజాగా ప్రియాంక వాద్రా కూడా వయనాడ్ ద్వారా రాజకీయ అరంగేట్రం చేయడం చూస్తే ఇది మరోమారు స్పష్టం అవుతుంది. ఒక్కొక్కరు రెండమూడు చోట్లా పోటీ చేయడం, గెలిచాక మరొకరిని దింపడం వంటివన్నీ ఖజానాపై భారం పడేలా చేస్తున్నాయి. తొలుత ఒక్కచోటే పోటీ చేసేలా చట్టం రావాలి. అలాగే కుటుంబంలో ఒక్కరికే రాజకీయ ప్రవేశం ఉండేలా చేయాలి. అప్పుడే దేశ ప్రజాస్వామ్యంలో ఇతరులకు చోటు దక్కుతుంది. రాజీవ్ కుటుంబంలో ఇప్పుడు మరొకరు అంటే ప్రియాంక రాకతో పార్టీ పూర్తిగా వారి గుప్పిట్లోకి వెళుతోంది. రేపు ఎక్కడో ఒకచోటు నుంచి రాబర్ట్ వాద్రా కూడా రాజకీయ ప్రస్తానం మొదలవుతుంది. రాహుల్ ఇప్పటికే వయనాడ్ వదులుకోవడంతో ప్రియాంక ఎంటర్ అవుతున్నారు. రాహుల్ రాయబరేలిని దక్కించుకున్నారు. సోనియా రాజ్యసభలో ఉన్నారు. ఇంట్లో ఉన్న ముగ్గురూ ఎంపిలుగా ఉండబోతున్నారు. రాబర్ట్ కూడా వస్తే వారింట్లోనే నలుగురు అవుతారు. ఇది ఎంతవరకు న్యాయమో ప్రజలు ఆలోచన చేయాలి. ఇలా కుటుంబంలోని అందరినీ చట్టసభలకు పంపితే వారికి దేశం పట్ల ఏమాత్రం బాధ్యత, చిత్తశుద్ధి ఉంటుందో ప్రజలు ఆలోచించాలి. సోనియా కుటుంబంతో పాటు లాలూ ప్రసాద్ కుటుంబం, ఫరూక్ అబ్దుల్లా కుటుంబం, అమిత్ షా కుటుంబం, చంద్రబాబు కుటుంబం,కెసిఆర్ కుటుంబం, వెంకటస్వామి కుటుంబం.. కరుణానిధి కుటుంబం...ఇలా చెప్పు కుంటూ పోతే రాజకీయాల్లో అన్నీ కుటుంబాల అజమాయిషీలోకి వెళ్లాయి. వీరికి కుటుంబ అవసరాలు, స్వార్థం తప్ప ప్రజల గురించి ఆలోచన ఉండదు. భారత జనాభా 140 కోట్లకు చేరిన క్రమంలో ప్రజల ఆశలు, ఆకాంక్షలు అందుకే నెరవేరడం లేదు. పాలకులు ఎప్పుడూ వీరే కావడం, కొత్తవారికి అవకాశం లేకపోవడంతో మార్పులు కానరావడం లేదు. కుటుంబ పార్టీలు గుత్తాధిపత్యం చెలాయిస్తున్నాయి. అందుకే పాలనలో కొందరే నిరంతరంగా ఉండే విధానం పోవాలి. పార్లమెంట్, అసెంబ్లీలకు ఒక్కరినే నిరంతరంగా ఎన్నుకునే విధానం కూడా మంచిది కాదు. ఈ క్రమంలో రాజకీయాల్లో రొటేషన్ పద్ధతి రావాలి. కుటుంబా లను దూరం పెట్టేలా సంస్కరణలు చేయాలి. ఒక్కరు ఒక్కచోటు నుంచే పోటీ చేయించగలగాలి. ఒక్కరికి రెండు పర్యాయాలు మించి అవకాశం లేకుండా చేయాలి. లేకుంటే వరుస పెట్టి వ్యాపారంలో లాగా అంతా రాజకీయాల్లో చేరి రాజకీయాలను, పాలనను వ్యాపారంగా మారుస్తున్నారు. అమెరికా తరహాలో కేవలం రెండు పర్యాయాలు మాత్రమే ఎన్నికల్లో పోటీచేసే విధానం రావాలి. ఒక్కరే ఏళ్లతరబడి ఎంపిలుగా, ఎమ్మెల్యేలుగా ఉండకుండా రెండు టర్మ్‌ల కాలాన్ని గరిష్టంగా నిర్ణయించాలి. ఈ మేరకు రాజ్యాంగంలో సవరణలు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే ఇప్పుడు ప్రియాంక రావడంతో మొత్తం సోనియా కుటుంబం పెత్తనంలోకి పార్టీ వెళ్లిపోయింది. ఖర్గే పేరుకే కాంగ్రెస్ అధ్యక్షుడు అని చెప్పాలి. లాలూ పార్టీ కావచ్చు, కెసిఆర్, కరుణానిధిల పార్టీలు కావచ్చు... వారే రాజ్యాం ఏలుతున్నారు. రాజకీయా లను మారిస్తేనే యువతకు అవకాశం వస్తుంది. యువత రాజకీయల్లోకి వస్తే మార్పులు కూడా వస్తాయి. దేశం పురోగమిస్తుంది. అందుకే ఎన్నికల్లో పోటీ చేసేవారికి అర్హతలను కూడా నిర్ణయించాలి. ఇలా అర్హతలు లేకపోవడం వల్లనే స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్య ఫలాలు అందరికీ అందడం లేదు. కొందరే పాలకులుగా ఉంటూ..ప్రజల ఆకాంక్షలను విస్మరిస్తున్నారు.

# సామాన్యుడిపై మెడికల్ మాఫియా పంజా..



నేడు మెడికల్ మాఫియా తన కోరలు చాచుకుని సామాన్యుడి ప్రాణాలతో చెలగాట మాడుతుందా... రోగుల వ్యాధులను, వారి అవసరాలను, బలహీనతలను అడ్డు పెట్టుకుని ప్రజల రక్తాన్ని తాగుతుందా.. అంటే అది నిజమేనని ప్రస్తుత పరిస్థితులు చెబుతున్నాయి.నేడు దేశంలోనూ, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో ఎక్కడా చూపినా వైద్యం పేరుతో ప్రజల ప్రాణాలతో చెలగాట మాడే డాక్టర్లు, వారి రక్తాన్ని సైతం తాగేసే కార్పొరేట్ ఆసుపత్రులు, రోగుల అవసరాలను ఆసరాగా చేసుకుని మందులను అధిక ధరలకు అమ్మేస్తున్న మందుల కంపెనీలు, దుకాణాదారులు కనిపిస్తారు..దీంతో అత్యవసర రంగమైన మెడికల్ కేర్ దోపిడీ వ్యవస్థగా మారిపోయింది.. దీనికి తోడు కార్పొరేట్ ఆసుపత్రులు, ఆయా ఆసుపత్రులతో పని చేసే బడా డాక్టర్లు ఫార్మా కంపెనీలు. డిస్ట్రిబ్యూషన్ కంపెనీలతో కుదుర్చుకున్న చీకటి ఒప్పందాలతో అడ్డదారిలో రోగులను దోచుకుంటూ, అధిక సంపాదనే లక్ష్యంగా కాలం వెళ్ళదీస్తున్నారు. .. ఫార్మా కంపెనీలు, రిటైల్ చైన్ షాపులు, డాక్టర్లతో ఒప్పందాలు.. ఇలా అన్నీ ఒకదానికొకటి ముడిపెట్టుకుని ఉండడంతో అడ్డదారి మెడికల్ దోపిడీలో సామాన్యులతో పాటు ఉన్నత వర్గాలకు చెందిన వారు సైతం భాగస్వాములవుతున్నారు. ఒకప్పుడు ఏదైనా జ్వరం వస్తే , పాత కాలపు పద్ధతుల ఏ కషాయమో తాగించి ఆ జ్వరాన్ని రెండు రోజుల్లో తగ్గించేవారు. కానీ నేడా పరిస్థితి లేదు.. నేడు జ్వరం వచ్చిందని ఆసుపత్రికి వెళితే చాలు వేలకు వేలు డాకర్లకు, ఆసుపత్రులకు చెల్లించుకోవాల్సిందే... ఆసుపత్రికి వెళ్ళగానే రోగి చెప్పే విషయం పట్టించుకోకుండా ఆయా డాక్టర్లు టెస్టులు, ఎక్స్‌రేలను అత్యవసరంగా చేయించేసి, రోగికి వేలల్లో ఖర్చును మిగులుస్తారు. తీరా ఆయా రిపోర్టులు వచ్చిన తరువాత అంతా నార్మల్ గా ఉందని పెదవి విరచి జ్వరం తగ్గడానికి మందులు రాసిచ్చి చేతులు దులుపుకునే పరిస్థితులు నేడు దాపురించాయి. ముఖ్యంగా నగరాలలో ఉండే కార్పోరేట్ ఆసుపత్రులలో ఇలాంటి దోపిడీ మరీ దారుణంగా ఉంది. ఇక మందులు విషయానికి వస్తే, ఆయా డాక్టర్లు రాసిన మందులనే వాడాలన్ననిబంధన పెడతారు. దీనికి కారణం కూడా లేక పోలేదు.. ఆయా డాక్టర్లు, మెడికల్ ప్రాక్టిషనర్లు అంతకు ముందే మందుల దుకాణాలతో కుదుర్చుకున్న ఒప్పందాల మేరకు ఫలానా దుకాణంలోనే మందులు కొనండంటూ సిఫార్సు చేస్తూ ఉంటారు. మరి కొంత మంది డాక్టర్లు ఇంకాస్త ముందుకెళ్ళి ఆ మందులను కూడా తామే విక్రయిస్తూ, తాము ఇచ్చే మందులు మరెక్కడా దొరక వని నమ్మబలికి రోగులను నిలువెల్లా గుల్ల చేస్తున్న సంఘటనలు కోకొల్లలు.. అలాగే, నేడు అత్యవసరం మందుల ధరలు కూడా అడ్డగోలుగా పెంచేస్తున్న రోజులు దాపురించాయి. ఆయా మందుల ధరలను ఎందుకు పెంచుతున్నారో, ఏ నిబంధనల మేరకు పెంచాలో అనే విషయాన్ని ఎవ్వరు గాక చెప్పరు.. ఏ అధికారీ కూడా కనీసం పట్టించుకోనూ చేయడు.. అవినీతిమయమై పోయిన వైద్యాధికారుల వల్లే ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయన్నది నిర్వివాదాంశం.. అసలు ప్రతి ప్రాంతంలోనూ డ్రగ్ ఇన్ స్పెక్టర్లు ఉంటారు. వారి పైన కూడా అనేక మంది అధికారులుంటారు. కానీ వారెప్పుడూ మందుల దుకాణాలకు గానీ, ఆసుపత్రులకు గానీ వచ్చిన సందర్భాలు చాలా తక్కువ.. ఒక వేళ వచ్చినా ఏదో మొక్కుబడిగా ఆయా దుకాణాలను పరిశీలిస్తారు తప్ప అసలు ఏం జరుగుతోంది.. అనే విషయాన్ని గాలికొదిలేయడం వల్లనే మెడికల్ పేరుతో మాఫియా సామ్రాజ్యం రోజురోజుకు కోరలు పెంచుకుంటోంది. దీనికి చీకటి ఒప్పందాల క్రమంలో సమాజం దేవుళ్ళకు ప్రతిరూపంగా భావించే డాక్టర్లు సైతం అక్రమ సంపాదనకు అలవాటు పడుతున్నారు. ఫార్మా కంపెనీల ప్రతినిధుల సూచనల మేరకే రోగులకు మెడిసిన్ ప్రిస్క్రిప్షన్ రాస్తూ ఒక్కో వైద్యుడు లక్షల్లో ఆర్జిస్తున్నారు. ఈ క్రమంపలో ఏ కంపెనీలతో ఒప్పందం కుదురుతుందో.. ఆ కంపెనీ ఉత్పత్తి చేసే ఖరీదైన మందులనే డాక్టర్లు ప్రోత్సహిస్తున్నారు. అదే సమయంలో మెడికల్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు నిర్వహిస్తున్న తమ ఔట్లెట్లలో ఆ మందులకు మాత్రమే డిస్కౌంట్లు ప్రకటిస్తున్నారు. డిస్కౌంట్ కావాలంటే.. అంతకు ముందుగా రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని రోగులకు మాయమాటలు చెబుతూ, మరో రూపంలో కూడా దోపిడీకి పాల్పడుతున్నారు. ఈ వ్యాపారం 'మూడు పువ్వులు, ఆరు కాయలు' అన్న చందంగా విస్తరించి ఆయా మందుల కంపెనీల యజమానులు కోట్లకు పడగెత్తుతున్నారు. దేశ వ్యాప్తంగా ఈ సమస్య పీడిస్తున్నా, తెలుగు రాష్ట్రాలలో సైతం సిండికేట్ మెడికల్ మాఫియా అమాయక ప్రజలే లక్ష్యంగా నిలువు దోపిడీకి పాల్పడుతోంది. నేటి సమాజంలో కల్తీ ఆహార పదార్థాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి కుటుంబంలోనూ మందుల వినియోగం దాదాపు నిత్యావసరంగా మారిపోతోంది. ఈ క్రమంలో మందుల విక్రయ సంస్థల ఆగడాలు నానాటికీ మితిమీరిపోతున్నాయి. భారీ డిస్కౌంట్ల పేరుతో ఎర వేసి మందుల వ్యాపారాన్ని ఆయా సంస్థలు విస్తరింపజేసుకుంటున్నాయి. భేంసారాలకు ఏమాత్రం అవకాశం లేని మందుల విక్రయంలో ప్రభుత్వపరంగా ఎలాంటి నిఘా లేకపోవడం, అత్యవసర పరిస్థితుల్లో తప్పనిసరిగా మందులు కొనుగోలు చేయాల్సి రావడం.. చీకటి ఒప్పందాలకు, అక్రమ వ్యాపారాల విస్తరణకు పరోక్షంగా దోహదపడుతున్నాయి. అలాగే, నిబంధనల ప్రకారం వైద్యుల ప్రిస్క్రిప్షన్ ఉంటేనే మెడికల్ షాపుల్లో మందులు ఇవ్వాలి. ఈ నిబంధనలను చాలా మంది దుకాణదారులు పాటించడం లేదు. జ్వరం, జలుబు, తలనొప్పి, కడుపునొప్పి గ్యాస్ట్రిక్ సమస్యలు, ఒంటినొప్పులు తదితర సమస్యలకు మెడికల్ షాపుల్లో అడగ్గానే మందులిచ్చేస్తున్నారు. చట్ట ప్రకారం కార్డియాలజీ, సైక్రియాట్రిక్, న్యూరాలజీ, యూరాలజీ, బ్రెయిన్ స్ట్రోక్, డయాబెటిక్, బీపీ, థైరాయిడ్, యూరిన్ ఇన్ఫెక్షన్ తదితర సమస్యలకు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇవ్వకూడదు. కానీ నేడా పరిస్థితి లేదు. వీటికి తోడు డ్రగ్స్, కాలపరిమితి దాటిన, నకిలీ మందుల విక్రయాలు సైతం జోరుగా సాగుతున్నాయి. డాక్టర్ రాసిన కంపెనీ ఔషధాలు లేకుంటే, వాటికి బదులు వేరే కంపెనీ మందులను దుకాణాదారులు అంటగట్టడం కూడా అలవాటై పోయింది. దీనికి తోడు మందుల దుకాణాల్లో డాక్టర్లకు ఇచ్చే శాంపిల్ మెడిసిన్, జనరిక్ మందులను కూడా ఎక్కువ ధరలకు యథేచ్ఛగా విక్రయిస్తూ వ్యాపారులు జేబులు నింపుకుంటున్నారు. దేశ వ్యాప్తంగా ఈ మెడికల్ మాఫియాను అరికట్టడానికి జనరిక్ మందులను ప్రవేశ పెట్టారు.కానీ ఈ జనరిక్ మందులు సైతం ఆకాశాన్నంటుతున్నాయి.. వంద రూపాయలు విలువ చేసే మందు మీద మూడు వంద రూపాయలు వెల ముద్రించి యాభై పర్సంటో, అరవై పర్సంటో డిస్కౌంటు ఇస్తున్నామని నమ్మబలికి సామాన్యుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. మరి కొన్ని చోట్ల పెద్ద దుకాణాల్లో సైతం జనరిక్ మందులు అంట గడుతూ, అధిక డిస్కౌంట్లు లేకుండా మందులు విక్రయించడం చేస్తుండడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇన్ని అనైతిక కార్యక్రమాలు చేస్తున్నా ఆయా మందుల దుకాణాదారుల మీ ద కానీ, డాక్టర్ల మీద కానీ, కార్పొరేట్ ఆసుపత్రుల మీద కానీ చర్యలు తీసుకున్న సందర్భాలు చాలా తక్కువ. మాముళ్ళకు కక్కుర్తి పడిన ఉద్యోగులు , అధికారుల వల్ల ఈ రంగం రోజురోజుకి సామాన్యుడికి ప్రాణాంతకంగా మారింది. ఏదో మొక్కుబడి తనిఖీలు తప్ప ఇలా అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకునేవారు నేడు కరవయ్యారు. ఇప్పటికైనా సంబంధిత వైద్యాధికారులు యధేచ్ఛగా సాగుతున్న ఈ మాఫియాపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

దాసరి దుర్గా ప్రసాద్

# ఐక్యరాజ్య సమితి వైఫల్యాలకు సంస్కరణలే మందు..

ప్రతి సంవత్సరం అక్టోబర్ 24న యునైటెడ్ నేషన్స్ డే (ఐక్య రాజ్య దినోత్సవం) ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారు. 1945లో ఐక్యరాజ్య సమితి చార్టర్ అమల్లోకి వచ్చిన వార్షికోత్సవాన్ని ఈ రోజు గుర్తు చేస్తోంది. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత ప్రపంచానికి కొత్త ఆశలు, కొత్త శాంతి ప్రక్రియలు అందించిన ఐక్యరాజ్య సమితి పాత్ర ప్రస్తుత వాతావరణంలో మసకబారుతుంది. 1945 అక్టోబర్ 24న సాన్ ఫ్రాన్సిస్కోలో 50 దేశాల ప్రతినిధులు యునైటెడ్ నేషన్స్ చార్టర్కు ఆమోదముద్ర వేశారు. ఐక్యరాజ్య సమితి అధికారికంగా స్థాపించబడింది. భవిష్యత్తులో ప్రపంచ యుద్ధాలను నివారించడం, ప్రపంచ దేశాల మధ్య శాంతిని కాపాడటం అనే ప్రధాన లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి ఏర్పడింది. ప్రపంచంలో శాంతిని నిలబెట్టడానికి ఐక్యరాజ్య సమితి చేసిన కృషిని గౌరవిస్తూనే దాన్ని మరింత బలోపేతం చేయటానికి ప్రపంచ దేశాలు కృషి చేయాల్సి ఉంది. ఇందుకోసం ప్రజాభిప్రాయాన్ని బలంగా చెప్పాల్సి ఉంది. ప్రజల మధ్య స్నేహం, ప్రపంచ దేశాల మధ్య శాంతి, సాంస్కృతిక ఐక్యత కోసం 83 ఏళ్ళ క్రితం ఏర్పడిన భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) దేశ వ్యాప్తంగా ఐక్యరాజ్య సమితి స్థాపన దినోత్సవం నిర్వహిస్తోంది. దీనివల్ల సామాజిక అవగాహన పెరుగుతుంది. విద్యా సంస్థలు, యూనివర్సిటీలు, సామాజిక సంస్థలు ఈ రోజున ఐక్యతను, సమైక్యతను సహకారాన్ని పెంపొందించడం లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. 21వ శతాబ్దంలో ఐక్యరాజ్య సమితి కొత్త సవాళ్లను ఎదుర్కొంటుంది. యుద్ధాల నివారణ, వాతావరణ మార్పులకు వ్యతిరేకంగా ఒప్పందాలు వంటి ప్రపంచ సమస్యలను పరిష్కరించడంలో ఐక్యరాజ్య సమితి విఫలం అవు తోంది. అలాగే, ప్రపంచంలో ఎదురవుతున్న డిజిటలైజేషన్, సైబర్ దాడులు, వాతావరణ మార్పుల ప్రభావాలను ఎదు ర్కోవడంలో ఐక్యరాజ్య సమితి చేయాల్సిన కృషి ఎంతో ఉంది.ప్రపంచ శాంతి, సహకారాన్ని నిలబెట్టడానికి ఐక్యరాజ్య సమితి ఒక ప్రపంచ సంస్థగా ఉన్నప్పటికీ, ఇటీవల ఉక్రెయిన్-రష్యా యుద్ధం, పలస్తీనా-ఇజ్రాయెల్ సంఘర్షణలలో ఈ సంస్థపై విపరీతమైన విమర్శలు వచ్చాయి. ఈ సంఘటనలలో ఐక్యరాజ్య సమితి పాత్ర, దాని సమర్థత ప్రశ్నార్థకమైంది. ఈ రెండు యుద్ధాలలోఐక్యరాజ్య సమితి విఫలమైందని జనాభిప్రాయం. ఉక్రెయిన్ కు అండగా వున్న నాటో దేశాలు, రష్యా మధ్య చర్చలు జరిగే వాతావరణం ఏర్పాటు చేయడంలోనూ, యుద్ధాన్ని అడ్డుకోవడంలో ఐక్యరాజ్య సమితి అసమర్థంగా ఉందని అనేక దేశాలు, రాజకీయ నాయకులు, మరియు పౌర సమూహాలు విమర్శిస్తున్నాయి. భద్రతా మండలిలోని "వీటో" అధికారం కారణంగా ఉక్రెయిన్, పాలస్తీనా యుద్ధాలను ఐక్యరాజ్య సమితి అడ్డుకోలేక పోతుంది. యుద్ధాలు ఏ కారణం వల్ల జరుగుతున్నా, ప్రజలు ఎదుర్కొంటున్న అవస్థలు, ఆస్తుల నష్టం ప్రపంచ దేశాలకు ఎన్ని పాఠాలు నేర్పినా, ఐక్యరాజ్య సమితి ఆపరేషనల్ సామర్థ్యాలు, చట్టపరమైన చర్యలు చాలా తక్కువగా ఉండటం విమర్శలకు కారణమైంది. అంతర్జాతీయ శాంతికి అడ్డంకిగా మారిన అణ్వాయుధాల తయారీ, వాటి వినియోగానికి అగ్ర రాజ్యాలు స్వస్తి పలకవలసిందిగా ఐక్యరాజ్య సమితి విజ్ఞప్తి చేసినప్పటికీ అవి ఖాతరు చేయటం లేదు.

పలస్తీనా-ఇజ్రాయెల్ సంఘర్షణ పలస్తీనా-ఇజ్రాయెల్ సమస్య కూడా ఐక్యరాజ్య సమితిపై తీవ్రమైన విమర్శలకు కారణమైంది. 1948 నుండి కొనసాగుతున్న ఈ సంఘర్షణలో ఐక్యరాజ్య సమితి ఇప్పటివరకు శాంతి కోసం ఎలాంటి సరైన పరిష్కారాన్ని సాధించలేకపోయింది. ఇజ్రాయెల్ ప్రభుత్వం పాలస్తీనీయులపై దాడులు చేస్తుండటం, పాలస్తీనీయుల వలసలు, వారి భూస్వాధీనంపై ఐక్యరాజ్య సమితి చర్యలు చాలా నీరుగారిపోయాయి. ఈ సంఘటనలపై ఐక్యరాజ్య సమితి మౌనం, తటస్థ వైఖరి చాలా దేశాల దృష్టిలో నిందలకు గురవుతోంది.పలస్తీనా ప్రజల హక్కులను కాపాడడంలో ఐక్యరాజ్య సమితి విఫలమైందని పలు హక్కుల సంస్థలు, దేశాలు, మరియు నాయకులు విమర్శిస్తున్నారు. ప్రతి కొత్త ముప్పు వచ్చినప్పుడూ ఐక్యరాజ్య సమితి తీర్మానాలు చేస్తోంది కానీ వాటిని అమలు చేయడంలో అసమర్థతను ప్రదర్శిస్తోంది. ఇజ్రాయెల్ పై విధించే చర్యలు వీటో అధికారంతో అడ్డుకట్టవుతుండటం వల్ల పలస్తీనీయుల భవిష్యత్తు అంధకారంలో మిగిలిపోతుంది. ఐక్యరాజ్య సమితి జనరల్ సెక్రటరీ ఆంటోనియో గుటెరస్ ను తమ దేశంలోకి రాకుండా బహిష్కరిస్తున్నాం అంటున్న ఇజ్రాయెల్ కు అగ్ర రాజ్యమైన అమెరికా, బ్రిటన్ మద్దతు బహిరంగ రహస్యమే. గాజాను పూర్తిగా నేలమట్టం చేసి లెబనాన్ ను పావు వంతు ఆక్రమించి, ఇరాన్ పై పూర్తి స్థాయిలో యుద్ధానికి సిద్ధం అవుతున్న ఇజ్రాయెల్ ను అగ్రరాజ్యాలు ఆపటం లేదు. యునైటెడ్ నేషన్స్ లో సంస్కరణల అవసరం ఈ రెండు సంఘటనలు ఐక్యరాజ్య సమితి చట్టపరమైన వ్యవస్థలో పెద్ద సంస్కరణల అవసరాన్ని తెలియ పరుస్తున్నాయి. భద్రతా మండలి వీటో వ్యవస్థను పునఃసమీక్షించాలని, శాశ్వత సభ్యత్వం ఉన్న దేశాలు మిగతా దేశాలపై ప్రభావం చూపకుండా వ్యవస్థను మార్చాలని పలువురు చేస్తున్న వాదనను పరిశీలించవలసిన తరుణం వచ్చింది. ప్రపంచ సమస్యలను సకాలంలో పరిష్కరించడానికి ఐక్యరాజ్య సమితి తన విధానాలను, మరియు చర్యలను సత్వరంగా మార్చుకోవలసిన అవసరం ఉంది. గ్లోబల్ సమస్యలను పరిష్కరించడంలో మరింత సమర్థవంతంగా మారడానికి సంస్కరణలు అత్యవసరం.



- కాగితాల రాజశేఖర్
ప్రధాన కార్యదర్శి, భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్), ఆంధ్రప్రదేశ్

# సేవా నిరతికి ప్రతిరూపం లక్ష్మీ సెహగల్

కెప్టెన్ లక్ష్మీ సెహగల్ (అక్టోబర్ 24, 1914... జూలై 23, 2012) ప్రముఖ సంఘ సేవకురాలు, రాజ్యసభ సభ్యురాలు. ఆమె భారత రాష్ట్రపతి పదవికి పోటీ చేసిన తొలి మహిళ. ఆమె తండ్రి స్వామినాథన్ మద్రాసులో ప్రముఖ న్యాయవాది. ఆమె బ్రిటిష్ ఇండియాలోని మలబార్, మద్రాస్ ప్రెసిడెన్సీలో 1914 అక్టోబర్ 24న జన్మించారు. ఆమె తండ్రి స్వామి నాథన్, తల్లి అమ్ముకుట్టి/ అమ్ము. తల్లి ఎ.వి.అమ్ము కుట్టి సామాజిక సేవా కార్యకర్త. చిన్నతనం లోనే సెహగల్ విదేశీ వస్తు బహిష్కరణ, మధ్య నిషేధం వంటి జాతీయ పోరా టాలలో పాల్గొన్నారు. 1938 లో మద్రాసు వైద్య కళాశాలలో ఎం.బి., బి.ఎస్. గైనకాలజీ పూర్తయిన తరువాత 1940లో సింగపూర్ వెళ్లడానికి ముందు చెన్నైలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్‌గా పని చేశారు. అక్కడ భారతీయ నిరుపేదల వాడలో వైద్యశాల స్థాపించి, స్థానికంగా ఉన్న భారతీయ కార్మికులకు సేవలందించారు. అక్కడ ఆమె ఉన్న సమయంలో, భారత జాతీయ సైన్యం సభ్యులను కలిసే అవకాశం లభించింది. భారత స్వాతంత్ర్య పోరాటంలో చురుకైన పాత్ర పోషించడం ప్రారంభించారు. ఆమె 1941లో ప్రముఖ స్వాతంత్ర్య సమరయ యోధుడు రాష్ బెహారీ బోస్ ఏర్పాటు చేసిన ఇండియన్ ఇండిపెండెన్స్ లీగ్‌లో చేరారు. 1943 లో సుభాష్ చంద్రబోస్ సింగపూర్ వచ్చినప్పుడు భారత స్వాతంత్ర్యం కోసం పోరాడటానికి ఒక మహిళా రెజిమెంట్ ప్రారంభిం చడం గురించి మాట్లాడారు. ఆ సమయంలో లక్ష్మీ సెహగల్ సుభాష్ తో సమావేశ మయ్యారు. నేతాజీ నుండి 'రాణి ఆఫ్ ఝాన్సీ' రెజిమెంట్‌ను స్థాపించడానికి ఆదేశాన్ని పొందారు. ఆయన స్థాపించిన ఇండియన్ నేషనల్ ఆర్మీ ఆధ్వర్యంలోని ఝాన్సీ రెజిమెంట్ కు ప్రాతినిధ్యం వహించారు.



అలా ఆమె కెప్టెన్ లక్ష్మిగా మారి సేవలు అందించారు. డాక్టర్‌గా వైద్య సేవలు కూడా అంద జేశారు. ఆమెను 1945 లో బ్రిటిష్ సైన్యం అరెస్టు చేసింది. 1946 వరకు బర్మాలో ఉంచింది. ఆ తర్వాత ఆమెను ఇండియన్ నేషనల్ ఆర్మీ ట్రయల్స్ జరుగుతున్న సమయం లోనే ఇండియాకు పంపించారు.లక్ష్మీ సెహగల్ 1947లో లాహౌర్ కు చెందిన కర్నల్ ప్రేమ్ కుమార్ సెహగల్ ను లాహౌర్‌లో వివాహం చేసుకొని కాన్పూర్ లో స్థిరపడి కాన్పూర్ ప్రజలకు వైద్య సేవలం దించారు. స్వాతంత్ర్యానంతరం ఆల్ ఇండియా డెమొక్రటిక్ ఉమెన్స్ అసోషియేషన్ (ఐద్వా) ఉపాధ్యక్షు రాలిగా వివిధ స్థాయిలలో సమాజ సేవకు అంకిత మయ్యారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, 1971లో లక్ష్మీ సెహగల్ కమ్యునిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్)... సిపిఎంలో చేరిన ఆమె జీవితాంతం వరకు క్రియాశీలక సభ్యురాలిగా కొనసాగారు. 1971లో, సీపీఎం పక్షాన లక్ష్మీ సెహగల్ రాజ్యసభ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. బంగ్లాదేశ్ సంక్షోభ సమయంలో, ఆమె బంగ్లాదేశ్ నుండి భారత దేశానికి వచ్చిన శరణార్థుల సంరక్షణలో సహాయ పడ్డారు.1981లో ఏర్పాటైన ఆల్ ఇండియా డెమొక్రటిక్ ఉమెన్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుల్లో ఆమె కూడా ఒకరు. అక్టోబరు 984లో, శ్రీమతి ఇందిరా గాంధీ హత్య నేపథ్యంలో నగరంలో సిక్కు వ్యతిరేక అల్లర్లు చెలరేగినప్పుడు, ఆమె సిక్కు కుటుంబాలకు రక్షణగా నిలిచారు. తన ఆసుపత్రి సమీపంలో ఉన్న దుకాణాలకు, దుకాణదారులకు హాని జరగనివ్వలేదు. 1984 లో, గ్యాస్ విషాదం తర్వాత ఆమె వైద్య బృందంతో భోపాల్‌కు వెళ్లి సేవలు అందించారు. 1998లో ఆమెకు పద్మ విభూషణ్ పురస్కారం ప్రదానం చేయబడింది. 2002 లో జరిగిన రాష్ట్రపతి ఎన్నికల్లో ఎపిజె అబ్దుల్ కలాంకు వ్యతి రేకంగా వామపక్షాల మద్దతుతో వామపక్షాల అభ్యర్థిగా బరిలోకి దిగారు. అయితే కలాం ఎన్నికల్లో విజయం సాధించారు. సామ్యవాదం, సామ్రాజ్య వాద వ్యతిరేకత, సమానత్వం, లౌకికవాదం, సామాజిక న్యాయం, మహిళా సాధికారత వంటి ఆదర్శాలకు ఆమె జీవితాంతం కట్టుబడి ఉన్నారు. 97 సంవత్సరాల వయసులో లక్ష్మీ సెహగల్ 2012, జూలై 23న కాన్పూర్‌లో మరణించారు. ఆమె మృతదేహాన్ని కాన్పూర్ మెడికల్ కాలేజీకి దానం చేశారు.

రామ కిష్టయ్య సంగనభట్ల

# అస్సాగో ఇథనాల్ కంపెనీ సమస్యపై
# రెండవ రోజు ఆమరణ దీక్ష

**శివగణేష్ సూర్యచంద్ర దీక్షకు పెరుగుతున్న మద్దతు**

**రాజకీయాలకతీతంగా ప్రజలు సంఘీభావం**

**శిబిరానికి జిల్లా కాలుష్య నివారణ అధికారులు**

**గుమ్మళ్లదొడ్డిలో భారీగా మొహరించిన పోలీసులు**





**గోకవరం, అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):** గోకవరం మండలం గుమ్మళ్ళదొడ్డి గ్రామంలో అస్సాగో ఇథనాల్ ఫ్యాక్టరీ సమస్యపై బుధవారం రెండో రోజు జగ్గంపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మరోతి శివగణేష్, సామాజిక ఉద్యమ నేత పాటంశెట్టి సూర్యచంద్ర ఆమరణ నిరాహార దీక్ష కొనసాగింది. గుమ్మళ్ళదొడ్డి, అచ్యుతాపురం, బావాజీపేట, వెదురుపాక గ్రామాలకు చెందిన పలువురు గ్రామస్తులు ఈదీక్షకు సంఘీభావంగా రిలే నిరాహార దీక్ష చేశారు. దీక్షా శిబిరాన్ని పలువురు సందర్శించి మద్దతునిచ్చారు. గుమ్మళ్ళదొడ్డిలో జాతీయ రహదారిపై సాగో కంపెనీ వద్ద గ్రామస్తులు రాస్తారోకో చేయాలని ప్రయత్నం చేయగా, పోలీసులు అడ్డుకున్నారు. ఈసందర్భంగా బాధిత ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఆమరణ దీక్షలో ఉన్న ఇరువురు నాయకులకు గుమ్మళ్ళదొడ్డి హెల్త్ క్లినిక్ సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. మరోతి శివగణేష్ ఆరోగ్యం క్షీణిస్తున్నట్టు తెలిసింది. గుమ్మళ్ళదొడ్డి రామాలయం వద్ద జరుగుతున్న ఆమరణ నిరాహార దీక్షా శిబిరాన్ని కోరుకొండ పోలీస్ సిఐ సత్య కిషోర్, గోకవరం ఎస్సై పవన్ కుమార్ సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఈసందర్భంగా దీక్షలో ఉన్న నాయకులతో పోలీసుల అధికారులు మాట్లాడుతూ, శాంతియుతంగా పోరాటం చేసుకోవచ్చని, ప్రజలకు ఇబ్బందులు కలగజేయవద్దని తెలియజేశారు. అయితే అక్కడున్న నాయకులు దీనిపై స్పందిస్తూ, ఇక్కడ ప్రజల సమస్యలపైనే ఆమరణ దీక్ష జరుగుతుందని, నాలుగు గ్రామాల ప్రజలు గత కొద్ది నెలలుగా ఇబ్బందులు పడుతున్నామని, తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నామని, అనారోగ్యాలు పాలవుతున్నామని తెలియజేశారు. ఉన్నతాధికారులు శిబిరాన్ని సందర్శించి, ఇక్కడ వాస్తవ పరిస్థితులను పరిశీలించి ఈకంపెనీ ఇక్కడ నుండి తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీక్షా శిబిరాన్ని వివిధ గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు సందర్శించి సంఘీభావం తెలియజేశారు. గుమ్మళ్ళదొడ్డిలో ఆమరణ నిరాహారదీక్ష జరుగుతుండటంతో భారీ ఎత్తున పోలీసులు మొహరించారు. కాలుష్య కారక ఇథనాల్ ఆల్కహాల్ ఫ్యాక్టరీ వల్ల కాలుష్య సమస్య తలెత్తుతుందని, భరించలేనంత దుర్వాసన, శబ్దం, పొల్యూషన్ ఏర్పడుతుందన్నారు. ప్రజలను రక్షించాలనే ఆమరణ దీక్ష చేపట్టామన్నారు. ఈసమస్యపై ప్రజల వేల సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని రిజిస్టర్ పోస్టులో ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని పాటంశెట్టి సూర్యచంద్ర తెలియజేశారు. ఈకార్యక్రమంలో పాటంశెట్టి సూర్య చంద్ర సతీమణి శ్రీదేవి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుర్రాల రత్నాజీరావు, బొల్లం బాపిరాజు, కొండా శ్రీను, రాజకీయాలకతీ తంగా బాధిత గ్రామాల నాయకులు అబిరెడ్డి రామభద్రం, ఓరుగం టి.సాయి, అధికారి కృష్ణప్రసాద్, శరకణం మురళి, అభిరెడ్డి చిన్ని, బొడ్డేటి శివాజీ, కొత్తపల్లి సత్యనారాయణ, నల్లల నాగేశ్వరరావు, కోలా వెంకటేశ్వరరావు, అధికారి నాగేశ్వరరావు, సమ్మెట సూర్యనా రాయణమూర్తి, రాంబాబు, చందాసి చినబాబు, బూలా అబ్బులు, ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ఈకార్యక్రమాలలో పాల్గొన్నారు.

గుమ్మళ్ళదొడ్డిలో నిర్వహిస్తున్న ఆమరణ నిరాహారదీక్షా శిబిరాన్ని కాలుష్య నివారణ బోర్డు అధికారులు సందర్శించారు. కంపెనీ వల్ల గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తాము వచ్చామని, ఇక్కడ బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి చేరవేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు స్థానికంగా ఎదుర్కొంటున్న జల, శబ్ద, వాయు కాలుష్యాల వివరాలను అధికారులకు తెలియజేశారు. జిల్లా కాలుష్య నివారణ బోర్డు ఇంజనీర్ రామచంద్రరావు, జిల్లా ఇంచార్జ్ పరిశ్రమల అధికారి పి.ప్రదీప్ కుమార్లు పాల్గొన్నారు.



## అచ్యుతాపురంలో రెవిన్యూ సభలో 19 దరఖాస్తులు

**గోకవరం, అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):** గోకవరం మండలం అచ్యుతాపురం గ్రామంలో బుధవారం రెండవ రోజు రెవిన్యూ గ్రామసభ జరిగింది. రీసర్వే డిప్యూటీ తహసిల్దార్ సాగర్ రెవిన్యూ సిబ్బందితో కలిసి గ్రామ సచివాలయం నందు ఈసభ నిర్వహించారు. రెవిన్యూ గ్రామ పరిధిలో ఉన్న రైతాంగ భూసమస్యలు, రీ సర్వే అనంతరం పెండింగ్‌లో ఉన్న సమస్యలపై పరిష్కారం కోసం రైతులు దరఖాస్తులు అందజేశారు. గ్రామంలో భూములు కలిగి ఉన్న వివిధ గ్రామాల నుండి వచ్చిన రైతులు, రెవిన్యూ సభలో సమస్యలు తెలియజేసుకున్నారు. ఈసభలో రైతు నాయకుడు న్యాయవాది నడిపల్లి ఫణికర్ గ్రామసభలో దరఖాస్తు చేశారు. గ్రామసభలో 19 దరఖాస్తులు వచ్చినట్టు రీ సర్వే డిప్యూటీ తాసిల్దార్ సాగర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో దివాకర్, మండల సర్వేయర్ వెంకటశివ, కమ్యూనిటీ సర్వేయర్ నాగేశ్వరరావు, గ్రామ సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అమరుడైన.. కమ్యూనిస్ట్ నేత పూనెం సత్యనారాయణ



**వి.ఆర్. పురం.అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):** వి ఆర్ పురం మండల సిపిఎం నాయకులు పూనెం సత్యనారాయణ హఠాత్ మరణంతో మండల ప్రజలు నిర్ఘంత పోయారు. ఎంతో చక్కని ఆరోగ్యంతో వున్నా ఆయనకు గుండెపోటు రావడం మరణించడం మండలప్రజలు జీర్ణించుకో జీర్ణించుకోలేక పోతున్నారు.."సీపీయం పార్టీకి వెన్నుముఖ లాంటి" పూనెం" తమ మధ్య లేరు తెలిసిన అయన అభిమా నులు పార్టీ కార్యకర్తలు శోక సముద్రం లో మునిగి పోయారు. సత్యనారాయణ పొద్దున్నే వ్యవసాయ పనులు నిమిత్తం పొలంకు వెళ్లి మధ్యాహ్నం భోజనం చేసి పొలం దగ్గర అస్వస్థతకు గురయ్యారు. రేఖపల్లి ఆసుపత్రికి తీసువచ్చిన సమయంలో అయన మరణించారు. ఈ మరణ వార్త విన్న అన్ని రాజకీయ పార్టీల నేతలు పూనెం సత్యనారాయణ భౌతిక దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. పూనెం సత్యనారాయణ మరణ వార్త తెలుసుకొన్న ప్రముఖ ఆయుర్వేద్యులు జమాల్ ఖాన్ పూనెం కుటుంబ సభ్యులను ఓదార్చారు. పేద ప్రజల కోసం పోరాడే పోరాటయోధుడు పోలవరం నిర్వాశితుల కోసం ఉద్యమించిన నేత సిపిఎం పార్టీ నిర్వహించిన పోలవరం పొలికేక ఉద్యమంలో ప్రధాన పాత్ర వహించారు.అయన సి.పి.యం పార్టీ సీనియర్ నాయకులు అమరజీవి కామ్రేడ్ పూనెం.సత్యనారాయణ సంతాప సభ రేపు అనగా ది.24.10.2024 న గురువారం నాడు రేఖపల్లి లో ఉదయం 10 గంటలకు జరుగుతుంది. పార్టీ కార్యకర్తలు, అభిమానులు,ప్రజలు హాజరవ్వగలరని వి.ఆర్ పురం మండల కమిటి మండలప్రజలను కోరారు. సంతాపసభ అనంతరం రేఖపల్లి నుంచి నూతిగూడెం వరకు బైక్ ర్యాలిగా సత్యనారాయణ అంతిమ యాత్ర ఉంటుందని.అనంతరం నూతిగూడెంలో అంత్యక్రియలు జరుగుతా యని పార్టీ నేతలుతెలిపారు.

## నట్టల నివారణ శిబిరాలు నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసిన ఉన్నత అధికారులు



**మొగల్తూరు, అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):** నరసాపురం మొగల్తూరు మండలాల్లో జరుగుతున్న నట్టల నివారణ శిబిరాలని బుధవారం జిల్లా పశువు సంవర్ధన శాఖ అధికారి డాక్టర్ కే.మురళీకృష్ణ, నరసాపురం డివిజన్ ఉపసంఖ్యాలకులు ఎవరు హుస్సేన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామాలలో పశు కాపరుదారులకు మరియు పశువుల పెంపకం యాజమాన్య రైతులకు నరసాపురం మండలం మొగల్తూరు మండలం శాఖ అధికారులు పర్యవేక్షణలో జరుగుతున్న కార్యక్రమాలను వారు పరిశీలించి సంతృప్తికరం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నరసా పురం సహాయ సంచాలకులు డాక్టర్ వై.సుధాకర్, నరసాపురం మండల పశు వైద్యశాఖ అధికారి ఇంజేటి సురేంద్ర కుమార్, మొగల్తూరు మం దల పశు సంవర్ధన శాఖ అధికారిని గొట్టుముక్కల నీలిమ, సిబ్బంది గు బ్బల శ్రీనివాస్,నారా.కృష్ణసాయి కే.రాము, సంజయ్, ఎ.హెచ్.ఎలు పాల్గొన్నారు.

## రాష్ట్రంలోనే అత్యధిక టిడిపి సభ్యత్వాలు చేయాలి: రామరాజు సూచన



**మొగల్తూరు,అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):** నర్సాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు టిడిపి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఇంచార్జి పొత్తూరి రామరాజు నిర్వహించి సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ నెల 26వ తారికున తెలుగుదేశం పార్టీ సభ్యత్వం నామోదు కార్యక్రమం రాష్ట్రంలో కన్నా అత్యధికంగా టీడీపీ సభ్యత్వాలు మన నర్సాపురం నియోజకవర్గంలో చెయ్యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సాధికార కమిటీ కన్వీనర్ కొప్పాడ రవీంద్ర ఠాగూర్, పట్టణ అధ్యక్షులు జక్కం శ్రీమన్నారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి కొల్లు పెద్దిరాజు, సినీయర్ నాయకులు అధికారి అనంతరామారావు, మాజీ వైస్ చైర్మన్ పొన్నాల నాగబాబు, తుమ్మలపల్లి లక్ష్మీనారాయణ, పెంద్ర శ్రీను, కోరాడ పాపారావు, కొప్పాడి సత్యన్నారాయణ, తిరుమాని శశిదేవి, బొర్రా చిన్నయమ్మ,, మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కాపవరం ఫిషర్ మెన్ సొసైటీ ఎన్నికలు ఏకగ్రీవం

**- ప్రెసిడెంట్‌గా కొండేటి ధర్మరాజు ఎన్నిక..**





**కోరుకొండ, అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):** కోరుకొండ మండలం కాపవరం ఫిషర్ మెన్ సొసైటీ ఎన్నికలు బుధవారం ఏకగ్రీవంగా జరిగాయి. సొసైటీ ప్రెసిడెంట్ కొండేటి ధర్మయ్య (ధర్మరాజు), వైస్ ప్రెసిడెంట్‌గా పులిదిండి (వెంకటేశ్వర్లు) వెంకన్న, కార్యదర్శిగా మట్టాడి వెంకన్న (వెంకటేశులు), డైరెక్టర్లుగా గుండుపల్లి స్వామి, కాటే వెంకటేశ్వర్లు, కొండేటి నాగేశ్వరరావు, గుండుపల్లి వెంకటకృష్ణ, గుండుపల్లి వెంకటశ్రీనివాస్, సబ్బితి అక్కయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి సహకార శాఖ డిప్యూటీ రిజిస్టర్ ఎం.జగన్నాథరెడ్డి వెల్లడించారు. ఈసొసైటీ నందు 121 మంది ఓటర్లు ఉండగా, 95 మంది హాజరయ్యారని ఆయన తెలియజేశారు. ఒక్కొక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయని తెలియజేశారు. ఈఎన్నికల కార్యక్రమానికి మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ వి.కృష్ణారావు, కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రర్లు టీ.కామరాజు, ఎం.మహేష్ కుమార్, కే.సుబ్బారావు, మత్స్యశాఖ డెవలప్మెంట్ ఆఫీసర్ ఎం బ్రహ్మానందం, ఇన్స్పెక్టర్ కె.హరీష్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ కృష్ణారావు మాట్లాడుతూ, సొసైటీ పాలకవర్గం సభ్యులు ఏ విధమైన వివాదాలు లేకుండా ఐక్యతగా సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అందుకు తమ వంతు సహకరిస్తామని తెలియజేశారు. కొండేటి ధర్మరాజు మాట్లాడుతూ, ఫిషర్మెన్ సొసైటీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో సొసైటీ సభ్యులకు ఎన్నో సంక్షేమ పథకాలు మంజూరు చేయించినట్లు తెలియజేశారు. అనంతరం ఏర్పడ్డ పాలకవర్గంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ బొడ్డు వెంకటరమణచౌదరి ఎన్డీఏ నాయకుల సహకారంతో మత్స్య సొసైటీ సభ్యుల అభ్యున్నతికి కృషి చేస్తానని తెలియజేశారు. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీనియర్ టిడిపి నాయకులు తెలగంశెట్టి శ్రీను మాట్లాడుతూ, సొసైటీలో ఉన్న ప్రతి కుటుంబానికి న్యాయం జరిగే విధంగా పాలకవర్గంతో సహకరించి ఎమ్మెల్యే బలరామకృష్ణ, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి వెంకటరమణ చౌదరితో కలిసి అభివృద్ధికి సహకరించడం జరుగుతుంద న్నారు. సిటీ పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకొన్నందుకు అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు వల్లేపల్లి దుర్గారావు, ఫిషర్ మెన్ సొసైటీ పాలకవర్గ సభ్యులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## కె.ఆర్ ఫ్రూట్ జ్యూస్ వారి 'కె ఆర్ బిర్యానీ' ప్రారంభం

**హోటల్ జగదీశ్వరి ఆవరణలో కనకాల రాజా నూతన వ్యాపారం**



**రాజమహేంద్రవరం, అక్టోబరు 23(ఆంధ్రపత్రిక):** కె.ఆర్ ఫ్రూట్ జ్యూస్ పేరుతో కోటిపల్లి బస్టాండ్ లో ఫ్రూట్ జ్యూస్ వ్యాపారం లో ఆరితేరిన ఛాంబర్ బిల్డింగ్ ట్రస్ట్ మాజీ కార్యదర్శి కనకాల రాజా తాజాగా 'కెఆర్ బిర్యానీ' పేరుతో కొత్త వ్యాపారానికి శ్రీకారం చుట్టారు.స్థానిక పాత మేడూరి హోటల్, ప్రస్తుతం హోటల్ జగదీశ్వరి ఆవరణలో 'కెఆర్ బిర్యానీ'ని బుధవారం ఉదయం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చేతులమీదుగా ప్రారంభించారు. కిచెన్ విభాగాన్ని పంతం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పంతం కొండలరావు, క్యాష్ కౌంటర్ ని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ,ఆర్యాపురం బ్యాంకు చైర్మన్ చల్లా శంకరరావు, ఛాంబర్ అధ్యక్షులు తవ్వా రాజా, గౌరవ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు ఆకుల వీర్రాజు, లక్ష్మీనారాయణ జవ్వార్,కొల్లేపల్లి శేషయ్య,బూర్లగడ్డ వెంకట సుబ్బ రాయడు,నందెపు శ్రీనివాస్, దొండపాటి సత్యంబాబు,మాజీ డిప్యూటీ మేయర్ బాక్స్ ప్రసాద్, మాజీ ఫ్లోర్ లీడరు వర్రే శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్స్ కురగంటి సతీష్, నీలపాల తమ్మారావు,శివశంకర్ చిట్స్ మేనేజర్ చీకట్ల సత్యనారాయణ, ఛాంబర్ బిల్డింగ్ ట్రస్ట్ కార్యదర్శి పచ్చిగోళ్ళ సురేష్ కుమార్, కూర్మదాసు ప్రభాకర్,రామినీడి మురళీమోహన్, చలుమూరు శ్రీనివాస్,అల్లూరి శేషునారాయణ రావు,వంటెద్దు సూరిబాబు,రెడ్డిమణి, పెంకె సురేష్ కుమార్,బాసా భాస్కర రెడ్డి,మద్దాల రవిశంకర్, రోజ్ మిల్క్ రాము,పనసయ్య,నిమ్మలపూడి గోవింద్,కొత్తపేట రాజా,వై శ్రీనివాస్,సిటీఆర్ ఐ బాచి,ఆకుల బాలు,వలవల చిన్ని, చాపల రాజు, ఇంకా వివిధ రంగాల ప్రముఖులు, మిత్రులు, శ్రేయోభిలాషులు విచ్చేసి, వ్యాపారం అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ,శుభాకాంక్షలు తెలిపారు. అతిధులకు 'కెఆర్ బిర్యానీ' అధినేత కనకాల రాజా,కనకాల అజయ్ స్వాగతం పలికారు. చికెన్ ఫ్రై పీస్ బిర్యానీ,ధమ్ బిర్యానీ, మటన్ బిర్యానీ, ఫ్రాన్స్ ఫ్రై బిర్యానీ, స్పెషల్ మటన్ బిర్యానీ (బోన్ లెస్), స్పెషల్ ఐటెంగా కొబ్బరి అన్నం కోడికూర,నాన్ వెజ్ మీల్స్, నాన్ వెజ్ కర్రీస్,లభిస్తాయని, పార్సిల్స్ సదుపాయం కూడా ఉందని కనకాల రాజా,కనకాల అజయ్ తెలిపారు.మా ఈ నూతన వ్యాపార ప్రారంభోత్సవ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, ఛాంబర్ ప్రముఖులు,వివిధ రంగాల ప్రముఖులు,ఖాతాదారులు, శ్రేయోభిలాషులు, బంధు మిత్రులు విచ్చేసి,మా వ్యాపారాభివృద్ధికి తోడ్పడాలని ఆశీర్వదించి నందుకు ధన్యవాదాలు తెలిపారు.

## ప్రజా సమస్యలు సమన్వయంతో పరిష్కరించాలి



**మొగల్తూరు, అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):** ప్రజా సమస్యలు తక్షణం పరిష్కరించుకునేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని మొగల్తూరు మండల తహసిల్దార్ రాజ్ కిషోర్ అన్నారు. బుధవారం మొగల్తూరు మండల పరిషత్ కార్యాలయం నందు మొగల్తూరు ఎంపీడీవో త్రిశూల్ పాణితో కలసి మండల స్థాయి అధికారులకు నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. మొగల్తూరు మండలంలో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన అర్జీలు వెంటనే పరిష్కార మార్గాలు జరపాలని ఆయన అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో మొగల్తూరు మండల పరిషత్ కార్యాలయ సూపర్డెంట్ ఎన్సిహెచ్ శ్రీనివాస్, ఎంఈఓ ఉన్నమట్ల శామ్యూల్ జాన్, మొగల్తూరు మండల వ్యవసాయ శాఖ అధికారి షేక్ అబ్దుల్ రహీం, ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

## కోరుకొండ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్



**కోరుకొండ, అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):** పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమం ముగింపు సందర్భంగా కోరుకొండ పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకుపోలీస్ విధులు, వాకీ టాకీ పనిచేసే విధానం, 100 కాల్ వంటి విషయాలపై కోరుకొండ పోలీస్ ఎస్ఐ శ్యాం సుందర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోరుకొండ షిరిడి సాయి స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజమండ్రిలో 'కా' సినిమా యూనిట్ హల్చల్



**రాజమహేంద్రవరం,అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):** వర్ధమాన కథ నాయకుడు కిరణ్ అబ్బవరం నటించిన కా మూవీ చిత్ర యూనిట్ రాజమండ్రిలో హల్చల్ చేసింది. బుధవారం సాయంత్రం స్థానిక షెల్టన్ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిత్ర నిర్మాత చింత గోపాలకృష్ణారెడ్డి, సినిమా హీరో కిరణ్ మాట్లాడారు. ఈ సందర్భంగా సినిమా హీరో కిరణ్ మాట్లాడుతూ తాను నటించిన 9 చిత్రాల్లో కా చిత్రం చాలా వైవిధ్యంగా ఉందని, యాక్షన్ సస్పెన్స్ అంశాలతో టీజర్ ఇంట్రెస్టింగ్‌గా ఉందన్నారు. పాన్ ఇండియన్ లెవెల్లో క మూవీ విడుదల కాబోతోంద న్నారు. చిత్ర నిర్మాత గోపాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే కా మూవీ టీజర్ సోషల్ మీడియాలో హల్చల్ చేస్తుందన్నారు. అక్టోబర్ 31న చిత్రం విడుదలవుతుందని అందరూ ఆదరించాలని కోరారు.

## లాగిన్లో పెండింగ్ సమస్యలు లేకుండా చూసుకోవాలి: ఎంపీడీవో త్రిశూల్ పాణి



**మొగల్తూరు, అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):** మొగల్తూరు మండలంలో ప్రభుత్వం ద్వారా అందిస్తున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమం పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని మొగల్తూరు ఎంపీడీవో చిటికెల త్రిశూల్ పాణి అన్నారు. బుధవారం మధ్యాహ్నం స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు మొగల్తూరు మండల ఇఓపిఆర్డి మేడిద నవీన్ కిరణ్ అధ్యక్షతన వెల్ఫేర్ అసిస్టెంట్లకు మరియు గ్రామ కార్యదర్శిలకు నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి ఉద్యోగి లాగిన్ ప్రకారం జాగ్రత్తగా నడుచుకోవాలని లాగిన్ లో సమస్యలు పెండింగ్ లేకుండా చూసుకోవాలని ఆయన కోరారు. వెల్ఫేర్ అసిస్టెంట్లకు పాఠశాలలో మరుగుదొడ్ల సందర్శన కార్యక్రమం విధిగా నిర్వహించాలని ఆయన కోరారు. ప్రతి ఉద్యోగి వాట్సాప్ సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకుని నడుచుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మండల స్థాయిలో పంచాయతీ కార్యదర్శిలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# డ్రోన్ టెక్ నవ ఆవిష్కరణలకు
# గొప్ప ముందడుగు










**వచ్చే అయిదేళ్లలో డ్రోన్ టెక్నాలజీ రంగంలో విప్లవాత్మక మార్పులు- డ్రోన్ రంగ భవిష్యత్తుపై తయారీదారుల్లో పెరిగిన విశ్వాసం- మేధస్సుకు కొదవ లేదు.. పెట్టుబడుల పరంగా సవాళ్లు- డ్రోన్ రంగ స్కిల్ డెవలప్‌మెంట్‌పైనా ప్రత్యేక దృష్టి- అమరా వతి డ్రోన్ సమ్మిట్-2024లో వక్తల అభిప్రాయాలు- విజయ వంతంగా ముగిసిన రెండు రోజుల సదస్సు- సదస్సు విజయవంతానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం తరపున**

**విజయవాడ,అక్టోబర్23(ఆంధ్రపత్రిక):** ధన్యవాదాలు తెలియజేసిన రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపా యాల శాఖ కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్, ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్.డ్రోన్ టెక్నాలజీ రంగంలో దేశానికి దశ దిశను నిర్దేశించేలా గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికతకు అనుగుణంగా, రాష్ట్రాన్ని దేశ డ్రోన్ రాజధానిగా మార్చాలనే ఆయన ఆకాంక్షకు అనుగుణంగా మంగళగిరిలోని సీకే కన్వెన్షన్స్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన అమరావతి డ్రోన్ సమ్మిట్-2024 బుధవారం విజయవంతంగా ముగిసింది.డ్రోన్ టెక్ నవ ఆవిష్కరణలకు ఈ సదస్సు గొప్ప ముందడుగు అని, వచ్చే అయిదేళ్లలో ఈ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటాయని సదస్సులో పలువురు వక్తలు స్పష్టం చేశారు. సదస్సుతో డ్రోన్ మ్యానుఫ్యాక్చర్లలో విశ్వాసం ఇనుమడించిందని.. ఈ ఊపుతో పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ), డ్రోన్ యూజ్ కేసుల రూపకల్పన, వివిధ రంగాల్లో వినియో గం తదితరాల్లో గణనీయ అభివృద్ధి సాధ్యపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యువ భారత్‌లో మేధస్సుకు కొదవ లేదని.. అయితే పెట్టుబడుల పరంగా సవాళ్లు ఉన్నాయని.. వాటిని ఎదుర్కొనేలా, స్టార్టప్‌లను ప్రోత్సహించేలా ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయన్న భరోసా సదస్సు ద్వారా లభించిందని పేర్కొన్నారు.

**సవాళ్లను ఎదుర్కొనేలా మేధోమథనం:** మంగళవారం గౌరవ ముఖ్యమంత్రి.. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుతో కలిసి ప్రారంభించిన అమరావతి డ్రోన్ సమ్మిట్‌లో రెండో రోజు బుధవారం డ్రోన్ రంగ నిపుణులు, ప్రభుత్వ అధికారులతో కూడిన ప్యానళ్లు విస్తృతంగా చర్చించాయి. ఐఐటీ మద్రాస్ డిఫెన్స్ డ్రోన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ హెచ్ ఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో వార్‌ఫేర్ విత్ ఇండీజినస్ డ్రోన్ అండ్ యాంటీ డ్రోన్ టెక్నాలజీస్‌పై ప్రభావవంతమైన చర్చ జరిగింది. అదే విధంగా హంచ్ మొబిలిటీకి చెందిన అమిత్ దత్తా నేతృత్వంలో భారతీయ డ్రోన్ రంగంలో పెట్టుబడుల పరంగా సవాళ్లపై చర్చ జరగ్గా.. రెడ్వింగ్ ల్యాబ్స్ కో-ఫౌండర్ అన్షుల్ శర్మ ఆధ్వర్యంలో ఆరోగ్య రంగంలో ఏరియల్ మెడికల్ సపోర్ట్, డ్రోన్ అంబులెన్సులు తదితరాలపై చర్చ జరిగింది.

రాష్ట్ర ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి జె.నివాస్, ఏపీఎంఎస్ఐడీసీ వీసీ అండ్ ఎండీ డా. జి.లక్ష్మీశ చర్చల్లో పాల్గొన్నారు. డ్రోన్ టెక్నాలజీస్ ద్వారా ప్రభు త్వ సేవలను ప్రజలకు చేరవేయడంలో, డ్రోన్ సాంకేతికతల అభి వృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. స్టార్టప్ లకు ఫండింగ్‌కు సంబంధించి అమలవుతున్న విధానాలను వివరిం చారు. అదే విధంగా మారుమూల గ్రామాల ప్రజలు, గిరిజన ప్రాంతాల ప్రజలకు సైతం నాణ్యమైన వైద్యసేవలు అందిం చడంలో డ్రోన్ సాంకేతికతల అనుసంధాన సాధ్యాసాధ్యాలపైనా చర్చించా రు. డిజిటల్ భూ రికార్డుల రూపకల్పనలో డ్రోన్ సాంకేతికత వినియోగంపై ప్రకాశం జిల్లా జేసీ రోణంకి గోపాలకృష్ణ కీలక ప్రసంగం చేశారు. డ్రోన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ స్మిత్ షా నేతృత్వంలో డ్రోన్ రంగానికి అవసరమైన నైపుణ్య వంతులైన మానవ వనరుల అభివృద్ధిపై చర్చ జరిగింది.ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఛైర్మన్, ఎండీ కె.దినేష్ కుమార్.. ఇటీవల విజయవాడ వరదల సమయంలో బాధితులకు ప్రభుత్వం అందించే సహాయక చర్యల్లో డ్రోన్ల వినియోగం విజయవంతం కావడంపై కీలక పీపీటీని ప్రజెంట్ చేశారు.

విపత్తుల నిర్వహణలో డ్రోన్ సాంకే తికతపై దార్శనికతను ఆవిష్కరించారు. వరద మ్యాపింగ్, పర్య వేక్షణ, ముంపు నష్టాల సత్వర అంచనా, ఆహారం, ఇతర సామగ్రి సరఫరా, పారిశుద్ధ్య కార్యకలాపాల్లో డ్రోన్లను వినియోగించిన తీరు ను వివరించారు. 437 డ్రోన్లు, 846 మంది సిబ్బంది, 4,073 ట్రిప్పుల ద్వారా ప్రజలకు అందించిన సేవలను వివరించారు.

**ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు:**గౌరవ ముఖ్యమంత్రి మార్గనిర్దేశనంతో అమరావతి డ్రోన్ సదస్సు-2024ను విజయవంతం కావడంలో భాగస్వాములైన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్, ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వం తరపున ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో భాగస్వాములైనవారిని ఘనంగా సత్కరించారు.

## ప్రతి ఒక్కరూ చదవటం, రాయడం తెలిసి ఉండి అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఉల్లాస్ అక్షరాస్యతా కార్యక్రమం

### అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ డా.నిధి మీనా



**విజయవాడ,అక్టోబర్23(ఆంధ్రపత్రిక):**పదిహేనేళ్లకు పైబడిన వయస్సు వారిలో నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించే ఉద్దేశంతో నిర్దేశించిన ఉల్లాస్ (అండర్‌స్టాండింగ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) కార్యక్రమ అమలును బుధవారం ఇంచార్జ్ కలెక్టర్ నిధి మీనా జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో గూగుల్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పాఠశాల, వయోజనవిద్య, డీఆర్‌డీఏ, గ్రామ-వార్డు సచివాలయాలు, ఐసీడీఎస్‌బీ సమాచార, పౌర సంబంధాల శాఖకు చెందిన అధికారులతో ఆమె మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం అమలుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా దృష్టిసారించాయని, పథకం లక్ష్యాల సాధనకు అధికారులు తమ వంతు కృషి ఉండాలన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లోని ఆయాలు, కుక్‌లు, హెల్పర్లు, నైట్ వాచ్‌మ్యాన్లు, అంగన్వాడీ సహాయకులలో నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాల్సి ఉందన్నారు.తొలిదశలో జిల్లాలో ఏడువేల మంది లబ్ధిదారులను గుర్తించి, అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. తొలుత విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ (వీవోఏ), క్లస్టర్ కోఆర్డినేటర్ల ద్వారా గుర్తించిన లబ్ధిదారులకు శిక్షణ అందించేందుకు ప్రతి పదిమందికి ఒక వాలంటీర్ టీచర్‌ను గుర్తించాల్సి ఉందన్నారు. ఇద్దరు మండల స్థాయి అధికారులకు బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ లో శిక్షణను ఇవ్వడం జరుగుతుందని అనంతరం జిల్లాస్థాయిలో, మండలస్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. నవంబర్ నుండి సాయంత్రం రెండు గంటల పాటు తరగతుల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. కాన్ఫరెన్స్ లో ఉల్లాస్ కార్యక్రమ నోడల్ అధికారి జి.ప్రసాద్‌రావు, డిఆర్ డిఎ పిడి శ్రీనివాసరావు, ఏపీవో ఎం.సింగయ్య, డీఈవో యూవీ సుబ్బారావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి,గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి ఉన్నారు.

### నియోజకవర్గంలో ఎమ్మెల్యే గళ్ళ మాధవి ఆధ్వర్యంలో
## పెద్ద ఎత్తున అభివృద్ధి పనులకు శ్రీకారం





**25వ డివిజన్ లో 2కోట్ల 33లక్షలతో సీసీ రోడ్లు మరియు డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణాలకు శంఖుస్థాపన- మీతోనే నేను - మీ వెంటే నేను కార్యక్రమంలో భాగంగా డివిజన్ లో సమస్యలను గుర్తించిన ఎమ్మెల్యే**

**గుంటూరు ,అక్టోబర్ 23( ఆంధ్రపత్రిక ):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గం లో డివిజన్ల వారీగా అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి శ్రీకారం చుట్టారు. డివిజన్ లలో "మీతోనే నేను - మీవెంటే నేను" కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి, వాటి పరిష్కారానికి అంచనాల వ్యాయాన్ని గుర్తించి తనకు నివేదిక అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కృషి ఫలితంగానే 25వ డివిజన్ కు సుమారు 2కోట్ల 33లక్షల అభివృద్ధి పనులను మంజూరు చేయించి, బుధవారం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ గతంలో నేను ఎన్నికల ప్రచారంలో ప్రకటించిన విధంగా వెనుకబడిన డివిజన్ల అభివృద్ధి కోసం తొలి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు గెలిచిన అనంతరం మీతోనే నేను - మీ వెంటే నేను కార్యక్రమంలో ఆయా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి ఇప్పటికే డివిజన్ లో మొత్తం రెండుసార్లు పర్యటించానని ఇక్కడ పారిశుధ్య సమస్యలు అధికంగా ఉన్నాయని గతంలో భారీ వర్షాల కారణంగా ఇక్కడ అనేక ఇళ్లలో నీళ్లు చేరాయని గుర్తించినట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. వీటికి అవసరమైన నిధులను మున్సిపల్ కమిషనర్ తో మాట్లాడి మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. తమ ప్రభుత్వంలో కక్షలకు తావులేదని నియోజకవర్గం లోని అన్ని డివిజన్లను సమానంగా చూసే అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. 25వ డివిజన్లో ఇంత భారీ ఎత్తున అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం చుట్టడంపై స్థానిక ప్రజలు తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. గతంలో గెలిచిన ఎమ్మెల్యేలు ఎప్పుడూ కూడా తమ ప్రాంతం వైపు చూడలేదని, కానీ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తమ ప్రాంతంలో 2సార్లు పర్యటించి,వెంటనే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టటము హర్షనీయమని ఇన్నేళ్ల తర్వాత తమ ప్రాంత సమస్యలు తీర్చటానికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే గళ్ళా మాధవికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాలం వెంకటేశ్వర్లు, కసుకుర్తి హనుమంతురావు, కదిరి సంజయ్,బీజేపీ రాజు, చెంబేటి మణి కుమారి,బాబు,వేముల శ్రీను,ప్రసాద్, పఠాన్ ఖాజా ఖాన్,ఈ ఈ సుందర్ రామి రెడ్డి, డి.ఈ మధు సూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయ ఆహ్వాన సమావేశానికి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు అందరూ ఆహ్వానితులే



**తిరువూరు, అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):** తిరు వూరు మండలం లక్ష్మీపురం గ్రామంలో గల మను గార్డెన్‌లో గురువారం (24 వ తేదీ)న జరుగు ఆత్మీయ ఆహ్వాన సమావేశానికి తిరు వూరు పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు సానుభూతిపరులు హాజరు కావా ల్సిందిగా తిరువూరు ము న్సిపల్ ఫ్లోర్ లీడర్ షేక్ అబ్దుల్ హుస్సేన్ బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గుంటూరు ఉభ య కృష్ణా జిల్లాల పట్ట భద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజ య వాడ పార్ల మెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) తిరువూరు శాసన సభ్యులు కొలికపూడిశ్రీనివాసరావు ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్య క్షులు మాజీ మంత్రివర్యులు నెట్టెం రఘురాం తిరువూరు నియోజకవర్గ పరిశీలకులు చిట్టిబాబు మరియు పార్టీ నాయకులు హాజరవుతున్నారు కనుక తెలు గుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తిరువూరు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ షేక్ అబ్దుల్ హుస్సేన్ పిలుపునిచ్చారు.

## కొరువాడజగన్నాధపురం
# గ్రామసభలో 86అర్జీలు



**కె.కోటపాడు,అక్టోబర్ 23(ఆంధ్రపత్రిక):** ఈనెల 17వ తేదీన ప్రారంభమైన రీ సర్వే భూ సమస్యల పరిష్కార గ్రామ సభలు షెడ్యూల్ ప్రకారం కొనసాగుతున్నాయి. బుధవారం మండలంలోని కె.జె.పురం (కొరువాడ జగన్నాధ పురం)గ్రామంలో సభ నిర్వహించారు. తహశీల్దార్ పి.భాగ్యవతి ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో రీ సర్వే భూ సమస్యలకు సంబంధించి పరిష్కారం కోరుతూ 86అర్జీలు అందాయి. గడచిన నాలుగు రోజుల్లో సూదివలస, ఉగ్గినవలస, కవికొండల అగ్రహారం, రొంగలినాయుడుపాలెం గ్రామాల్లో సభలు నిర్వహించారు. కె.జె.పురంసభతో ఇప్పటి వరకూ జరిగిన ఐదు గ్రామాల సభల్లో 230 వినతులు రైతుల నుంచి అందాయి. కె.జె.పురం గ్రామ సభలో రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ బి.సూరి, మండల సర్వేయర్ కె.రామచంద్రమూర్తి, విలేజ్ రెవెన్యూ అధికారి శివకుమార్ మండలంలోని వి.అర్.ఒ.లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## నారా లోకేష్‌కు ధన్యవాదములు తెలిపిన మంగళగిరి ప్రజారోగ్య వేదిక, 100 పడకల సమగ్ర ప్రభుత్వ ఆసుపత్రి సాధన కమిటీ సభ్యులు



**మంగళగిరి, అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):** మంగళగిరి ప్రజలు ఆకాంక్ష తీర నుంది. గత 25 ఏళ్ల నుండి ఎదురుచూస్తున్న కల నేటికి నేరవేరు తుంది. దీనికి కారణమైన మంత్రి నారా లోకేష్ ను మంగళగిరి ప్రజలు అభి నందిస్తు న్నారు. మంగళగిరి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని తీసుకురావలని ప్రజా ఆరోగ్య వేదిక, వంద పడకల సమగ్ర ప్రభుత్వ ఆసుపత్రి సాధన కమిటీ ఆధ్వర్యంలో గత పది సంవత్సరాలుగా చేస్తున్న పోరాటానికి ఫలితం దక్కింది. మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా నిర్మాణం చేయాలని నిధులు మం జూరు చేయడం, రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం జరిగింది. ప్రజా ఆరోగ్య వేదిక, వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి సాధన కమిటీ ఆధ్వ ర్యంలో బుధవారం మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మంత్రి నారా లోకేష్ కు ధన్యవాదాలు తెలిపారు.మంగళగిరి టిడిపి ఎమ్మెల్యే డాక్టర్ ఎంఎస్ ఎస్ కోటేశ్వరరావు హాయంలో టిడిపి వ్యవస్థాపకులు దివంగత ముఖ్య మంత్రి ఎన్టీ రామారావు 09.04.1986 లో మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రి కి నిర్మాణంకు శంకుస్దాపన చేశారు. ఎంఎస్ఎస్ హాయంలోనే ప్రభుత్వ ఆసుపత్రి 20.4.1989న ప్రారంభమైయింది. 2000 సంవత్సరం నుండి ఆస్పత్రిలో ఒకే ఒక డాక్టర్ ఉండి పనిచేస్తున్నారు. అప్పటినుండి ప్రజా సం ఘాల ఆధ్వర్యంలో పోరాటం చేయడం జరిగింది. గత పది సంవత్సరాల నుండి ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో పోరాటం జరిగింది. రాష్ట్ర మంత్రివర్గం ఆసుపత్రి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ ఆమోదం తెలియజేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కేక్ కట్ చేశారు ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ కు అభినందనలు తెలిపారు. ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ కె వి ఎస్ సాయి పసాద్ మాట్లాడుతూ 2014 నుండి 2019 వరకు అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది. ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, కేఎస్ లక్ష్మణరావు సహాయ సహకారాలతో అప్పటినుండి అధికారి యంత్రాంగాన్ని కలిసి వినపత్రాలు ఇవ్వడం జరిగింది. 2014 నుండి 2019 మధ్యలో 40 లక్షల రూపాయలను ఆనాటి టిడిపి ప్రభుత్వం మంజూరు చేయడం జరిగింది అని తెలిపారు. దానితో కొంతవరకు అభివృద్ధి చేయడం జరిగింది అని అన్నారు. ఆస్పత్రి స్థలంలో కాంప్లెక్స్ కట్టాలని ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ కోర్టుకు వెళ్లి ఆ జీవోను రద్దు చేయించడం జరిగిందని అన్నారు.ఈ నేపధ్యంలో 2024 ఎన్నికల కు ముందు నారా లోకేష్ మంగళగిరి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి స్దానంలో 100 పడకల ఆసుపత్రి తీసుకువస్తామని మంగళగిరి ప్రజలకు స్పష్టమైన హామీ ఇచ్చారు. మంగళగిరి ఎమ్మెల్యేగా గెలిచిన నారా లోకేష్ 4 నెలల కాలంలోనే మంగళగిరి ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చారని అన్నారు.ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా 1986లో శంకుస్థాపన చేయడం జరిగింది. 1989 సంవత్సరంలో ప్రారంభించడం జరిగింది. ఆస్పత్రి 10 సంవత్సరాల పాటు ఈ ప్రాంత ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడం జరిగిందని తెలిపారు. తర్వాత శిథిలావస్థకు చేరుకుందని అన్నారు. త్వరలో మంత్రి నారా లోకేష్ వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రికి శంకుస్థాపన చేయనున్నారని చెప్పారు. వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి సాధనలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు సహకరించాయని తెలిపారు. దాతల సహకారంతో కొంత అభి వృద్ధి చేయడం జరిగిందని అన్నారు.100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ప్రజల కు అందుబాటులోకి వస్తే పైసా ఖర్చు లేకుండా పేదవారికి నాణ్యమైన మెరుగైన వైద్య సేవలు లభిస్తాయి. బడుగు, బలహీన, పేద వర్గాలకు ఎంతో ఉపయుక్తకరంగా, అందుబాటులో ఆసుపత్రి వైద్య సేవలు అందుతాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ఆరోగ్య వేదిక నాయకులు డాక్టర్ ఎం వంశీకృష్ణ, ఎం నాగేశ్వరావు, నన్నపనేని నాగేశ్వరావు, వల్లభనేని వాణి, దామర్ల నాగమణి, ఏ జయరాజు, ఎం గోవర్ధన్ రావు, ఎస్ బాలకృష్ణ, వివి ప్రసాద్, వి వెంకటేశ్వరరావు, ప్రసాద్ వివిధ ప్రజా సంఘాల నాయకులు జెవి రాఘవులు, పి బాలకృష్ణ, ఎస్ ఎస్ ఛాంగయ్య, వై కమలాకర్, ఎం బాలాజీ, ఎం రవి, ఎస్ గణేష్, టిడిపి నాయకులు జి ధనుంజయ రావు, అబ్దుల్ మజీద్ కరీం నల్లందా ఒకేషనల్ జూనియర్ కళాశాల నర్సింగ్ విద్యార్థులు, మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అవగాహన, అప్రమత్తతతోనే క్యాన్సర్ వ్యాధి నిర్మూలన

### గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వై కిరణ్ కుమార్



**గుంటూరు,అక్టోబర్ 23( ఆంధ్రపత్రిక ):** ప్రపంచవ్యాప్తంగా వస్తున్న భౌగోళిక వాతావరణం మార్పులు, మనుషుల జీవనశైలి, తీసు కుంటున్న రసాయనక పంటల ఆహారం ద్వారా క్యాన్సర్ వ్యాధి ప్రపంచవ్యాప్తంగా విజృంభిస్తున్నదని ప్రజలలో ఈ వ్యాధి పట్ల పూర్తిస్థాయి అవగాహన, జీవన శైలిలో మార్పు ద్వారానే అరికట్టగలమని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ పేర్కొన్నారు. ప్రజా ఆలోచన వేదిక ఆధ్వర్యంలో జిజిహెచ్ నాట్కో సమావేశ మందిరంలో క్యాన్సర్ రోగులకు అంకిత భావంతో సేవలందిస్తున్న జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్,నాట్కో హెచ్ ఓ డి, ప్రొఫెసర్ డాక్టర్ జి దుర్గాప్రసాద్, ప్రొఫెసర్ టీవీ శివరామకృష్ణ, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎం శ్రీనివాస్, డాక్టర్ ఏ జాహ్నవి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎన్ మురళి, డాక్టర్ టి వెంకట్ రెడ్డి, డాక్టర్ జ్యోతుల మురళీకృష్ణ, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆవుల విజయ కుమారిల అభినందన, సత్కార సభ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ రోగులను కాపాడటంలో ప్రతిక్షణం అత్యంత విలువైనదని గోల్డెన్ అవర్ లో వైద్యం అందిస్తే ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చునన్నారు. క్యాన్సర్ రోగ పీడితులకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా సొంత బంధువుగా ఆదరించి పూర్తిస్థాయిలో నాట్కోలో అన్ని రకాల పరీక్షలు, శస్త్ర చికిత్సలు, మందులు, పేషెంట్ తో పాటు సహాయకులకు భోజన సదుపాయాలు కార్పొరేట్ ఆసుపత్రులకు భిన్నంగా సేవలందిస్తున్నామని తెలిపారు. రాబోయే రోజులలో 100 నుండి 250 పడకల క్యాన్సర్ హాస్పిటల్ గా రూపుదిద్దుకోపోతున్న సందర్భంగా ప్రజలు నన్నపనేని వెంకన్న చౌదరిని తమ గుండెల్లో పెట్టుకుంటారని చెప్పారు. నేడు ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య వృత్తి కత్తి మీద సామల మారిందని వైద్యులు, సిబ్బందిపై దాడులు భయం కలిగిస్తున్నాయని ప్రజల్లో మార్పు రావాలని అందుకు ప్రజా ఆలోచన వేదిక ఇలాంటి స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని కోరారు. నాట్కో క్యాన్సర్ సెంటర్ విభాగాధిపతి డాక్టర్ జి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రజా ఆలోచన వేదిక వంటి స్వచ్ఛంద సంస్థల గుర్తింపు ద్వారా తనతో పాటు సహచర వైద్యులపై మరింత బాధ్యత పెరిగిందన్నారు.నాట్కో కోఆర్డినేటర్ యడ్లపాటి అశోక్ కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ సెంటర్ ప్రారంభించిన నాలుగు సంవత్సరాలుగా వేలాదిమంది క్యాన్సర్ రోజులకు ఉచిత శస్త్ర చికిత్సలు అందించడంతో పాటు అన్ని రకాల వైద్య సేవలతో ప్రభుత్వ రంగంలోని లెవెల్ వన్ క్యాన్సర్ సెంటర్ గా గుర్తింపు పడటం హర్షదాయకమన్నారు.

త్వరలో సుమారు 20 కోట్ల రూపాయలు వేయడంతో మరొక 150 పడకల అదనపు భవన నిర్మాణం నవంబర్ నెలలో ప్రారంభిస్తామని తెలియజేశారు. ప్రజా ఆలోచన వేదిక అధ్యక్షులు మేడూరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య సేవల మీద గౌరవం పెరిగేలా నాట్కో ఆసుపత్రిలో తన భార్య ఆషా కరుణ్ కు గత ఐదు నెలలుగా చేస్తున్న చికిత్సలకు కృతజ్ఞతగా పదిమందికి స్ఫూర్తి కలిగించాలని వైద్యులను, నర్సింగ్ సూపరింటెండెంట్ను సత్కరించడం సామాజిక బాధ్యతగా భావించినట్లు వివరించారు. ఈ సందర్భంగా సమాజ సేవకుడు వల్లూరు సదాశివరావు నాట్కో ఆసుపత్రికి 50 వేల రూపాయలు విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో సర్జికల్ ఆంకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ రామారావు, డైటీషియన్ పీరూ సాహెబ్, జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె చంద్రశేఖర రావు, నర్సింగ్ సిబ్బంది, రోగుల సహాయకులు, వైద్యతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పీపుల్స్ తహసీల్దార్‌గా రెవిన్యూ అధికారి పనితీరు ఉండాలి

## కలెక్టర్ పి.ప్రశాంతి



**రాజమహేంద్రవరం, అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):**ఏదైనా ఒక అర్జీ పరిష్కారం కోసం వేచి ఉండే ధోరణితో కాకుండా, సమయాను కూలంగా ప్రవర్తించే తీరును బట్టి అర్జీదారుడు సంతృప్తి స్థాయి ఉంటుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. బుధవారం ఉదయం స్థానిక కలెక్టర్ కార్యాలయ దృశ్య మాధ్యమ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి రెవిన్యూ అధికారుల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ, ఏదైనా సమస్య పరిష్కారం కోసం ఆర్డీవోలు, తహసిల్దార్ లు క్షేత్ర స్థాయిలో ఎంతవరకు స్పందించారో అన్న వాటిపై ఆధారపడి ఉంటుందన్నారు. అర్జీ దారునికి అందుబాటులో ఉండడం, క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసే విధానం బట్టే ఉంటుందన్నారు. మండల స్థాయిలో పరిష్కారం అయ్యే సమస్యలు జిల్లా కలెక్టర్‌కి రావడం పై కలెక్టర్ ప్రశ్నించారు. ఇకపై టూర్ డైరీ సమర్పించే క్రమములో క్షేత్ర స్థాయిలో ఎన్ని పిజిఆర్ఎస్ అర్జీలను పరిశీలన చేసినట్లు నివేదిక లో పొందుపరచాలని పేర్కొన్నారు. ఇకపై రెవిన్యూ అధికారుల సమావేశంలో డివిజన్ స్థాయిలో నిర్వహిస్తామని తెలిపారు.క్షేత్ర స్థాయిలో వస్తున్న ఫిర్యాదులను పరిష్కరించేందుకు వారిని పిలిపించుకుని ఓపికగా వివరాలు తెలుసుకుంటే మనపై నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. సమస్య తెలుసుకునే ప్రయత్నం మనం చెయ్యగలిగితే తమకి తగిన న్యాయం చేకూరుతుందని అన్న విశ్వాసం పెంచేలా పనితీరు ఉంటే కలక్టర్ వద్దకు, ఇతర ఉన్నతాధికారులకు వొచ్చే అవకాశం లేదన్నారు. దిగువ స్థాయిలో పనిచేసే వారికి వారీ పరిధి మేరకు పనులను చేపట్టాల్సి ఉంటుందని స్పష్టం చెయ్యాలన్నారు. పీపుల్స్ తహసిల్దార్‌లుగా రెవిన్యూ అధికారి పనితీరు ఉండాలనీ పేర్కొన్నారు. ఇకపై టూర్ డైరీ సమర్పించే క్రమములో క్షేత్ర స్థాయిలో ఎన్ని పిజిఆర్ఎస్ అర్జీలను పరిశీలన చేసినట్లు నివేదికలో పొందుపరచాలని పేర్కొన్నారు. మండల స్థాయిలో పరిష్కారం అయ్యే సమస్యలు జిల్లా కలెక్టర్ కి రావడం పై కలెక్టర్ ప్రశ్నించారు.దిగువ స్థాయిలో పనిచేసే వారికి వారీ పరిధి మేరకు పనులను చేపట్టాల్సి ఉంటుందని స్పష్టం చెయ్యాలన్నారు. పీపుల్స్ తహసిల్దార్ లుగా రెవిన్యూ అధికారి పనితీరు ఉండాలనీ పేర్కొన్నారు. పాలసీ పరమైన అర్జీలు మాత్రమే కలెక్టర్ స్థాయిలో పరిష్కారం లభించే అవకాశం ఉంటుందన్నారు.పిజి ఆర్ ఎస్ ద్వారా ఇప్పటి వరకూ 1158 రెవిన్యూ పరంగ 1158 అర్జీలు రాగా, వాటిలో 825 కలక్టరేట్ కు, 152 మండల స్థాయికి, ముఖ్యమంత్రి కార్యాలయంకి 23, ఉప ముఖ్యమంత్రి ద్వారా 6, ఇతరములు 152 ఉన్నాయన్నారు. రెవిన్యూ శాఖ పరంగా 42 అంశాలకు సంబంధించి అర్జీలు పరిష్కారం కోసం వొస్తాయని, వాటిలో మొదటి 10 అంశాలకు సంబంధించినవి 999 ఉండగా, మిగిలిన 32 అంశాలకు సంబంధించినవి 159 మాత్రమే ఉన్నాయని తెలిపారు. నాణ్యతతో కూడిన అర్జీలను పరిష్కారం చెయ్యకపోవడం వల్లనే అర్జీలు రీ ఓపెన్ అవుతున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు పేర్కోన్నారు. రెవిన్యూ అధికారుల సమావేశంలో రెవిన్యూ సంబంధ, ప్రజా ఫిర్యాదుల అంశాలపై చర్చించి వాటికీ నిర్ణయాత్మకమైన పరిష్కారం కోసం ప్రతి ఒక్కరూ తప్పకుండా బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సర్వీస్‌కు చెందినవి 321, ఆర్వోఆర్ 243, ఆక్రమణలు 121, భూసేకరణ 75, సెక్షన్ 22 (ఏ) 58 ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశాల్లో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, ఆర్డీవోలు ఆర్.కృష్ణ నాయక్, రాణి సుస్మిత, కలక్టరేట్ ఏవో ఆలీ మహమ్మద్, తహసీల్దార్లు, ఇతర రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న కూటమి నాయకులు



**అనకాపల్లి,అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):** విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారిని కూటమి నాయకులు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీ.ఎం రమేశ్,విజయవాడ ఎం.పీ కేశినేని చిన్ని,యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తదితరులు అమ్మవారిని బుధవారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ప్రజా ప్రతినిధులకు ఆలయ అర్చకులు వేద పండితులు పూర్ణ కుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారికి ఆలయంలో అర్చనలు అభిషేకాలు విశేష పూజలు నిర్వహించిన అనంతరం వేద పండితులు ఆశీర్వచనలు అందజేసి శాలువాతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించి తీర్ద ప్రసాదలు అందజేశారు.

## తీర ప్రాంత అభివృద్ధికి మంత్రి దుర్గేష్ హామీ: ఎమ్మెల్యే నాయకర్



**మొగల్తూరు, అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):** నరసాపురం సముద్ర తీర ప్రాంతాన్ని పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఆంధ్ర ప్రదేశ్ పర్యటక మరియు సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను నరసాపురం శాసనసభ్యులు ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ కోరారు. బుధవారం మంగళగిరి లోని ఆయన కార్యాలయంలో కలుసుకుని నరసాపురం అభివృద్ధికి సహకరించాలని కోరారు. కందుల దుర్గేష్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే నాయకర్ తెలిపారు.

# జిల్లాలో ఖరీఫ్ సీజన్ తొలి ధాన్యం కొనుగోలు సొమ్ము చెల్లింపు

**- కోనుగోలు చేసిన 48 గంటల్లోగా రైతు ఖాతాకు జమ..**
**- జెసి చిన్న రాముడు..**

**రాజమహేంద్రవరం అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):** రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీకి కట్టుబడి 2024-25 ఖరీఫ్ సీజన్లో రైతుల నుంచి కోనుగోలు చేసిన ధాన్యం సొమ్మును 48 గంటల్లోగా రైతు బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలలోకి వెళితే నల్లజర్ల మండలం ప్రకాశరావు పాలెం రైతు సేవా కేంద్రం లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతు అప్పసాని నాగమణి 16.40 మెట్రిక్ టన్నుల కామన్ వెరైటీ రకం ఖరీఫ్ ధాన్యం అక్టోబరు 21 న సేకరణ చెయ్యడం జరిగింది. ఇందు నిమిత్తం రైతుకు చెల్లింపులు చెయ్యవలసిన రు.37,720 /- బుధవారం రైతు బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరిగిందని జెసి చిన్న రాముడు తెలియ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీకి కట్టుబడి ధాన్యం సేకరణ చేసిన 48 గంటల్లో నగదు చెల్లింపు జరపడం పట్ల రైతు నాగమణి హర్షం వ్యక్తం చేశారు. జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు ఆదేశాల మేరకు బుధవారం స్థానిక ప్రకాశరావు పాలెం రైతూ సేవా కేంద్రాన్ని జిల్లా పౌర సరఫరాల అధికారి జెవిఎస్ ప్రసాద్ సందర్శించి రికార్డులను పరిశీలించడం జరిగింది.

## బాలల హక్కులు పరిరక్షణకై చర్యలు కోరుతూ

# ఎస్పీని కలిసిన కమిషన్ సభ్యులు



**అనకాపల్లి.అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అనకాపల్లి జిల్లా పోలీస్ కార్యాలయం సందర్శించి, ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్ మర్యాద పూర్వకంగా కలిసి మొక్కని అందజేశారు. అనకాపల్లి జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణ నిమిత్తం తీసుకోవలసిన చర్యలు మరియు వివిధ శాఖల సమన్వయంతో అనకాపల్లి జిల్లా పోలీసులు చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ తెలియజేశారు. ముఖ్యంగా బాల్య వివాహాలను అరికట్టాలని, బాలల పై జరిగే అకృత్యాలు అరికట్టేందుకు పోక్సో చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, నిందితులకు శిక్షలు పడేవిధంగా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. మాదకద్రవ్యాలు సేవించ కుండా ఉండేందుకు అవగాహన కల్పించాలని తెలిపారు. బాల కార్మికులు నిర్మూలించేందుకు జిల్లా పోలీసులు సహకరించాలని గొండు సీతారాం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ శ్రీమతి కె.అనంతలక్ష్మి, బాలల సంరక్షణ అధికారి ఎం.రమేష్, పి.ఓ.ఎన్.ఐ.సి కే.ఎల్.మనోహర్, పి.ఓ.ఐ.సి.పి.లక్ష్మి లు పాల్గొన్నారు.

# త్వరితగతిన న్యాయం..



**అనకాపల్లి,అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):** రోలుగుంట మండలం, జే.పీ.అగ్రహారం గ్రామంలో మైనర్ మరియు దివ్యాంగురాలు అయిన బాలికను నిందితుడు. బైక్ మెకానిక్ కాకర దాసు తన ఇంటిలోనికి తీసుకొని వెళ్లి మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన అభియోగం. బాలిక ఏడుస్తూ ఇంటికి వచ్చి మంచం మీద పడుకుని కడుపులో నొప్పి వస్తుందని ఏడుస్తూ సైగలతో అమ్మమ్మకి చెప్పింది. దీంతో బాధితురాలు తల్లి పోలీసుల్ని ఆశ్రయించగా, జూలై 7న పోక్సో కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు తగిన ఆధారాల్ని కోర్టు ముందుంచారు. దీంతో నేరం రుజువు కావడంతో నిందితుడు కాకర దాసుకు 3 సం.,లు కారాగార శిక్షతో పాటు రూ.30,000/- జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయ మూర్తి జి.ఆనందిని బుధవారం తీర్పు ఇచ్చారు. బాధిత కుటుంబానికి ఆ సొమ్ము చెల్లించాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ ఆదేశాలు మేరకు మహిళలు, బాలికలపై జరిగిన నేరాలను ప్రయారిటీ కేసులో భాగంగా ఈ కేసును త్వరితగతిన దర్యాప్తు పూర్తిచేసి, కోర్టులో నేరాభియోగపత్రం సమర్పించి, కోర్టులో విచారణ త్వరగా వచ్చే విధంగా జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కేసులో పి.పి కరణం కృష్ణ వాదనలు సమర్థిస్తూ విశాఖపట్నం, పోక్సో కోర్టు జడ్జి తీర్పును వెల్లడించడం జరిగింది. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్., ఈ కేసు దర్యాప్తు అధికారులైన రోలుగుంట పి.ఎస్ అప్పటి ఎస్సై కృష్ణారావు, ఇన్స్పెక్టర్ సుభద్రమ్మ మరియు వాదనలు వినిపించిన పీ.పీ కరణం కృష్ణ రోలుగుంట పోలీస్ సిబ్బంది మరియు కోర్టు మానిటరింగ్ సెల్ సిబ్బంది. సాక్షులను సకాలంలో కోర్టులో హాజరు పరిచి, నిందితులకు శిక్ష పడే విధంగా దర్యాప్తు నిర్వహించిన అధికారులను అభినందించారు.

## తెలుగు విశ్వవిద్యాలయానికి

# పొట్టి శ్రీరాములు పేరు కొనసాగించాలి



**అనకాపల్లి,అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):**తెలంగాణ రాష్ట్రంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును కొనసాగించాలని కోరుతూ అనకాపల్లి టౌన్ లో ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో పొట్టి శ్రీరాములు పవిత్ర స్తుతి పర్యవేక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారము ర్యాలీ చేయడం జరిగిందని ఎన్టీఆర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ పేరట్ల నరసింహమూర్తి తెలంగాణ ప్రభుత్వం ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 1985లో నాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును ఖరారు చేసి గజిట్ నోటిఫికేషన్ చేశారని అప్పటినుండి పొట్టి శ్రీరాములు పేరుతోనే కొనసాగుతుందని అర్ధాంతరంగా తెలంగాణ ప్రభుత్వం పొట్టి శ్రీరాములు పేరు మార్చి వేరే పేరుని పెట్టాలని ఆలోచనతో ఉన్నట్లుగా సమాచారం ఉందని అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగుజాతి ఔన్నత్యం కోసం పోరాటం చేసిన వ్యక్తిని అటువంటి వ్యక్తి పేరు తొలగించే ప్రయత్నం చేయడం విచారకరమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పొట్టి శ్రీరాములు తొలగించే విషయంలో పునర్ ఆలోచన చేయాలని అదే పేరును కొనసాగించాలని సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ డిడి.నాయుడు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో కూడా ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరుని తొలగించి వైయస్ రాజశేఖర్ రెడ్డి పేరుపెట్టినప్పటికీ తరువాత వచ్చే ప్రభుత్వం తొలగించిందని ప్రజలకు సేవ చేసిన వ్యక్తుల పేర్లు ఏ ప్రభుత్వం పెట్టినా కొనసాగించాలని తొలగించడం తొందరపాటు చర్య అవుతుందని అటువంటి చర్యల నుంచి ఆలోచన నుండి తెలంగాణ ప్రభుత్వం విరమించుకోవాలని డిడి నాయుడు తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల నూక రామలింగ స్వామి రాజ్యలక్ష్మి యల్లపు సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంవి లోవరాజు ఎం రవికుమార్ కె.వి సూరిబాబు కే ఆదిబాబు కాండ్రేగుల వెంకట జగ్గారావు కొణతాల ఆది నాగేశ్వరరావు కాండ్రేగుల శ్రీనివాసు యల్లపు నూకరాజు బొడ్డేడ మోహన్ కాండ్రేగుల గంగరాజు మద్దాల సత్తిబాబు తుత్తురు బంగారు రాజు కైచర్ల చిన్న బూడిద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తగ్గించిన పాల సేకరణ ధరను పెంచాలని తోటాడలో నిరసన

**- 29న విశాఖ డైరీని ముట్టడిస్తాం**



**మునగపాక, అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):** విశాఖ పాల డైరీ పాల సేకరణ ధరను తగ్గించి రైతుల ఆదాయాలకు గండి కొట్టడాన్ని వ్యతిరేకిస్తూ బుదవారం ఉదయం తోటాడలోని పాల సేకరణ కేంద్రం వద్ద రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, సిఐటియు నాయకులు వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ డైరీకి పాలు సేకరిస్తున్న రైతులకు అర్ధాంతరంగా ఆవుపాల ధరను తగ్గించి రైతులపై పెను భారాన్ని మోపడాన్ని రైతులంతా వ్యతిరేకించాలని, ఇప్పటికే పాల సేకరణ రైతులకు ఇవ్వాల్సిన బోనస్ నివ్వకుండా విశాఖ డైరీ ఎగ్గొట్టారని అన్నారు. ఒక వైపు పశు దానాకు విపరీతంగా ధర పెంచి రైతులు పై భారాలు మోపుతున్నారని అన్నారు. అంతే కాకుండా పాల రైతుల డబ్బులతో డైరీ కున్న ఆస్తులు పాలకవర్గం ఇష్టానుసారంగా ఖర్చు చేస్తూ అవినీతి అక్రమాలకు నిలయంగా మారిందని ఇష్టానుసారంగా ఖర్చు చేస్తున్నారని, పాల రైతులకు ఇవ్వాల్సిన బోనస్ విషయంలో పాల సేకరణ ధర విషయంలో మాత్రం అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. డైరీ యాజమాన్యం తగ్గించిన పాల సేకరణ ధర పెంచకపోతే ఈ నెల 29న విశాఖ డైరీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల రామ సూరప్పారావు, కృష్ణ పాల రైతులు పాల్గొన్నారు.

## అయోడిన్ డెఫిసియన్సీ లోపం వల్ల జరిగే నష్టాలపై

# హై స్కూల్ పిల్లలకి అవగాహన




**మునగపాక, అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):**మునగపాక ప్రణీత హై స్కూల్ నందు ప్రజాప్రగతి ట్రస్ట్ తిరుపతి మరియు న్యూట్రిషన్ ఇండియా గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారి సహకారంతో క్రియేటివ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అయోడిన్ డెఫిసియన్సీ లోపం వల్ల జరిగే నష్టాలపై హైస్కూల్ పిల్లలకి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అయోడిన్లు లేని ఉప్పు వాడటం వల్ల చాలా ప్రమాదకరమైన రోగాలు గురికావాల్సి వస్తాదని అంతేకాకుండా పిల్లలులో శారీరిక మరియు మానసిక లోపాల కలుగుతాయని అయోడిన్ సాల్ట్ వాడకపోవడం వల్ల థైరాయిడ్ మరియు గోయిటర్ అంటే గొంతు వాపు కొన్ని రకాల వ్యాధులు వస్తాయి అని, ప్రైమరీ హెల్త్ సెంటర్ హెల్త్ సూపర్వైజర్ మళ్ల నాగేశ్వరరావు పిల్లలకు అవగాహన కలిగించడమైనది. ఈకార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీమతి దేవకాంత, క్రియేటివ్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి మల్ల నాగేశ్వరరావు, మరియు ప్రణతి హై స్కూల్ ప్రిన్సిపాల్ సతీష్ మాస్టారు మరియు ఉపాధ్యాయులు పాల్గొనడం అయింది.

## తుమ్మపాలెం మేజర్ పంచాయతీలో

# డ్రైన్లు నిర్మాణానికి శంకుస్థాపన



**అనకాపల్లి, అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):**తుమ్మపాల మేజర్ గ్రామ పంచాయతీ గవరపేట వీధి రామాలయము దగ్గర నుండి శివాలయం వరకు సిసి రోడ్ అండ్ సీసీ డ్రైన్ రెండు కోట్లరూపాయలతో గౌరపేట వీధికు, ప్రమీల నగర్ ఎల్లయ్య కాలువ సిసి డ్రైన్ కోటి 80 లక్షలు తో- ఈ రెండు పనులకు బుధవారము గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు అధ్యక్షతన కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించడం జరిగింది అన్నారు ముఖ్యంగా గవరపేట వీధిలో గత 30 సంవత్సరాల నుండి మురుగు నీటి కాలువ సంబంధించి. స్థానిక నివాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్న. సంగతి తెలిసిందే గ్రామ ప్రజలకు దీర్ఘకాలిక గా ఉన్న సమస్యను మురికినీటి కాలువ రోడ్డు పనులు జెసిబి సహాయంతో ఆక్రమణలు. తొలగించి పనులు ప్రారంభించారు అలాగే ప్రమీల నగర్ నందు గల ఎల్లయ్య కాలువ పనులు కూడా ప్రారంభించారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు గ్రాంట్ నుండి వచ్చినటువంటి మండల నిధులను నుండి ఈ పనులు ప్రారంభం చేయడం జరిగిందన్నారు దీర్ఘకాలికంగా ఉన్న మురికి నీరు కాలువ రోడ్ల పనులు పూర్తి అయిన వెంటనే తుంపాల మేజర్ పంచాయతీ రోడ్లు సర్వాంగ సుందరంగా ఉంటాయని సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు అన్నారు ఈ కార్యక్రమంలో, ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి చంద్రశేఖర్, పిల్ల హర శ్రీనివాసరావు ,వైస్ ప్రెసిడెంట్ చదరం చిన్న , ఎంపీటీసీ పంచదారల కన్నారావు, బిఎస్ఎన్ఎల్ అడ్వైజర్ కమిటీ జిల్లా కమిటీ మెంబర్ పీలా విశ్వేశ్వర రావు, పీలా తాతునాయుడు , స్కూల్ చైర్మన్ బలరాం మరియు గ్రామ ప్రజలందరూ పెద్దలు మహిళలు తదితరులు పాల్గొన్నారు

## మొగల్తూరులో బిజెపి సభ్యత్వ నమోదు



**మొగల్తూరు, అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):**పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం మొగల్తూరు గ్రామంలో భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు దాసరి బాబి, ఓబీసీ మోర్చా జిల్లా సెక్రెటరీ ఆముదాలపల్లి వెంకటాచార్యులు, పశ్చిమగోదావరి జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యుడు పులపర్తి రమేష్, బిజెపి నాయకులు ఇంటి ఏడుకొండలు బొరుసు శివ కడలి శ్రీమన్నారాయణ లక్కు శ్రీను, పిట్టల రాజేష్ సుబ్రహ్మణ్యం, నాగిడి దుర్గా నాగేశ్వరరావు మరియు బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా మొగల్తూరు ముద్దుబిడ్డ "ప్రభాస్" పుట్టినరోజు వేడుకలు



**మొగల్తూరు, అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):**యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ పుట్టిన రోజు సందర్భంగా స్థానిక కనకదుర్గ థియేటర్ లో, మొగల్తూరు గాంధీ బొమ్మ సెంటర్‌లో ప్రభాస్ అభిమానుల సమక్షంలో నరసాపురం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు చేతుల మీదుగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణ వీధుల గుండా అభిమానులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వేదిక వద్ద ఏర్పాటు చేసిన భారీ కేక్ కట్ చేసి అభిమానులకు అందజేశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు మాట్లాడుతూ తెలుగు చిత్ర పరిశ్రమ ను ప్రపంచ నలుమూలల వ్యాప్తి చేసిన నటుడు ప్రభాస్ అని మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు అన్నారు. పెద్ద నాన్న రెబల్ స్టార్ కృష్ణంరాజు వారసుడిగా సినీ రంగ ప్రవేశం చేసిన అతి కొద్ది కాలంలోనే పాన్ ఇండియా నటుడిగా ఎదిగిన ఏకైక నటుడు ప్రభాస్ అని అన్నారు. కరోనా సమయంలో తన వంతు భారీ సాయం అందిస్తూ, ప్రకృతి విలయాలు సమయంలో ఆ ప్రాంత ప్రజలకు భారీ సాయంతో అండగా ఉంటూ, తనలోని మానవతా దృక్పధం చాటి చెప్పుకునే వ్యక్తి ప్రభాస్ అని అన్నారు. అభిమానుల చేత డార్లింగ్‌గా పిలిపించుకుంటూ, ప్రజల గుండెల్లో దానకర్ణుడిగా కీర్తింపబడుతూన్నా నటుడు మన డార్లింగ్ ప్రభాస్ అని మాధవ నాయుడు అన్నారు.ఈ కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా యంగ్ రెబల్ స్టార్ అసోసియేషన్ కన్వీనర్ చింతపల్లి రవి కుమార్, లక్ష్మీపతి, గన్నవరపు శ్రీను, కశ్యప్, దీపక్, రావి నాని, కొండేటి శ్రీను, బస్వాని ఏడుకొండలు, కలిదిండి కుమార్ బాబు, దొంగ సత్యనారాయణ, కవురు నాగేశ్వరరావు, పొన్నాల నాగబాబు, బొక్క చక్రవర్తి, నడిపూడి కృష్ణ, రెడ్డిమ్ శ్రీను, పులపర్తి దత్తు, కొల్లాటి హరికృష్ణ, కొల్లాటి రాజు, తిరుమాని వెంకటేష్ మరియు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు, ప్రభాస్ అభిమానులు పాల్గొన్నారు.

## రీ సర్వే, భూ సమస్యలపై రెవెన్యూ సదస్సు




**మునగపాక, అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):**మండలంలో వాడ్రాపల్లి గ్రామంలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అధ్యక్షతన రెవెన్యూ రీ సర్వే మరియు గ్రామసభ బుదవారం జరిగింది. ఈ సంధర్భంగా కూటమి నాయకులు కోయిలాడ దశావతారం, మళ్ల వరహా నరసింగరావు, కాండ్రేగుల నూక అప్పారావు, మళ్ల శేషు బాబు తదితరులు మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ లో ఓల్టేజ్ సమస్య వలన రైతులు తీవ్రంగా ఇబ్బంది పడటమే కాకుండా, ఆర్థికంగా నష్టపోతున్నారని పిర్యాదు చేశారు. లో ఓల్టేజ్ సమస్య పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, గ్రామ పరిధిలో ప్రభుత్వ భూములు, జిరాతి భూములు సర్వే చేసి పూర్తి స్థాయిలో హద్దులు గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఆది మహేశ్వర రావు, వి.ఆర్.ఓ రమేష్ మరియు ఆర్డిఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సేంద్రియ ఎరువులతో
## ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత నివ్వాలి



**డుంబ్రిగుడ,అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):**ఏజెన్సీ గిరిజన ప్రాంతంలోని గిరి రైతులు సేంద్రియ ఎరువులతో కూడిన ప్రకృతి వ్యవసాయాలు చేయడానికి ప్రాధాన్యత నివ్వాలని కోర్రాయి పంచాయతీ సర్పంచ్ పి.కొములు సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చిన్న అంజోడ గ్రామంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులతో పండిన పంటలు వాడటం వల్ల పలు రకాల అనర్థాలు చోటుచేసుకుంటాయి అన్నారు. అదే కానీ సేంద్రియ ఎరువులతో పండిన పంటలను ఉపయోగిస్తే ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. అనంతరం మండల వ్యవసాయ అధికారిణి నీలవేణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేయడానికి కృషి చేయాలని, ఆర్గానిక్ సర్టిఫికెట్ కోసం ప్రతి ఒక్క రైతు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అసిస్టెంట్ పి.సాయిత, ఏపీ సీఎన్ఎఫ్ ఇంచార్జ్ మహేష్, ఐసిఆర్పి యూనిట్ కార్యకర్తలు సిడబ్ల్యూ ఎస్ ఎన్జీవో ప్రతినిధి సునీల్ కుమార్, పంచాయతీ రైతులు పాల్గొన్నారు.

## సత్తా చాటిన కైట్స్ విద్యా విహార్ స్కూల్ విద్యార్థులు



**అచ్యుతాపురం, అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):**43వ సీనియర్స్ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్ అనంతపురం జిల్లా నరపాలలో శ్రీ నేతాజీ స్కూల్ నందు ఈ నెల 19-21జరిగిన టోర్నీలో అనకాపల్లి పురుషులు మరియు మహిళలు ఇద్దరూ 2వ స్థానంలో నిలిచారు. ఈ టోర్నమెంట్‌లో అనకాపల్లి జిల్లా అచ్యుతాపుతారం కైట్స్ విద్యా విహార్ స్కూల్ నుంచి ఇద్దరు విద్యార్థులు చైతన్య మరియు ధక్షిత్ ఎంపిక అయ్యారు. రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా పోటీలకు కైట్స్ స్కూల్ నుంచి వాసు ఎంపిక అయ్యారు మరియు ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీలకు అడిగర్ల జాగృతి ఎంపిక అవ్వడం జరిగింది. ఎంపిక అయిన విద్యార్థులను పాఠశాల కరెస్పాండెంట్ రెడ్డి గణేష్ మరియు ప్రిన్సిపాల్ ప్రసన్న అభినందించారు. నేషనల్ లెవెల్‌లో ప్రతిభ కనబరిచి ఆంధ్రప్రదేశ్ తరపున కూడా రాణించాలని ప్రోతాహం తెలియజేస్తూ తమ విద్యార్థులు స్పోర్ట్స్‌లో రాణించడం గర్వకారణం అని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఫీజికల్ డైరెక్టర్ శివాజీను అభినందించారు.

## సత్కార సభ



**అచ్యుతాపురం, అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):** మండలంలో ఉప్పవరం, మల్లవరం ఎర్రవరం, సెక్రటరీగా మూడు సంవత్సరాలు పనిచేసి బదిలీ అయిన ఏ.పనింద్ర, పి.శ్యామలని ఉప్పవరం, మల్లవరం, ఎర్రవరం సర్పంచులు శ్రీ పిన్నమరాజు వాసు, చిన్ని శ్రీనివాసరావు, గంగిరెడ్డి రాము ఆధ్వర్యంలో బుధవారం సత్కార సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో ఏవో కృష్ణ, హరిపాలెం సర్పంచ్ ఎంఎస్, పి.ఆర్.జె.ఈ.నాయుడు, ఎక్స్ సర్పంచ్ కండిపల్లి శ్రీనివాస రావు, పందల శ్రీను, చందాక శివ, ఉప సర్పంచ్ కూనిశెట్టి సత్తిబాబు, అడపా మహాలక్ష్మి నాయుడు, చిన్ని సత్తిబాబు, బత్తిన పెద్ద రమణ, చల్ల సూరిబాబు, చోడపల్లి రమణ, టీ.తిరుమల రావు, ఎస్.సత్తిబాబు, సచివాలయం సిబ్బంది మరియు గ్రామ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఫాస్టర్ ఫిలిప్ డేవిడ్‌కు ఘన సన్మానం

### క్రిష్టియన్ మైనార్టీ అధ్యక్షులు ఫిలిప్ డేవిడ్ సేవలపై హర్షం



**వేపాడ, అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):**నియోజకవర్గంలోని వేపాడ మండలానికి సమీపంలోని కె.కోటపాడు మండలం సూరెడ్డిపాలెం గ్రామంలోని బేతేలు ప్రార్ధనా మందిరంలో జరిగిన ప్రత్యేకమైన కూడిక సందర్భంగా మండలంలోని జాకేరు చర్చి ఫాస్టర్ ఫిలిప్ డేవిడ్ దంపతులను బుదవారం ఘనంగా సన్మానించారు. ఎస్.కోట నియోజక వర్గ క్రిష్టియన్ మైనార్టీ అధ్యక్షులుగా అందిస్తున్న విశేష సేవలను కొనియాడుతూ శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అలాగే ఫాస్టర్ జాన్సన్ దూసి ఆద్వర్యంలో జరిగిన ఈ కూడిక సందర్భంగా కొంత మంది దైవజనులు, విశ్వాసులు హాజరై ఫిలిప్ డేవిడ్ సేవలను ప్రశంసించారు.యేసు క్రీస్తు మహాకృప మేరకు ఫిలిప్ డేవిడ్ ఆనేక మంది సేవకులకు సహాయ పడుతున్నారని అభినందించారు.ఈ కార్యక్ర మంలో వేపాడ ఫెలిష్ అద్యక్షులు ఫాస్టర్ సిల్వనస్,ఫెలోషిప్ సెక్రటరీ ఫాస్టర్ జాన్ హైడ్, అడ్వైజర్ ఫాస్టర్ లాజరస్, ఫాస్టర్ పీటర్,ఫాస్టర్ డానియల్, తబిత తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో సిటీ స్కాన్ సేవలు పునః ప్రారంభం

### ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కృషి పట్ల ప్రశంసల జల్లు

**అనకాపల్లి, అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):** సిటీ స్కాన్ రోగ నిర్ధారణలో ఓ సంచలనం. రోడ్డు ప్రమాదం జరిగి తలకు తీవ్రంగా దెబ్బలు తగిలినప్పుడు తలలో ఏం జరిగిందో తెలియదు. బయటకు రక్తం చుక్క రాకపోయినా మెదడుకు ఏమైందోనన్న ఆదుర్దా పడతాం. ఈ భయాన్ని తగ్గించేదే సిటీ స్కాన్. బయట ప్రైవేట్ ఆస్పత్రిలో వేలకు వేలు ఖర్చు పెట్టి చేయించుకునే ఈ సిటీ స్కాన్ సేవలు మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చొరవతో ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో బుధవారం నుంచి ప్రజలకు, రోగులకు అందుబాటులోకి వచ్చాయి. గత రెండు రోజులుగా దీనిపై ట్రైల్ రన్ నిర్వహించారు. 2023 డిసెంబర్ లో ఒక కోటి 85 లక్షల రూపాయల వ్యయంతో ఆదానీ గ్రూప్ సిఎస్ఆర్ నిధులతో ఈ సిటీ స్కాన్‌ను ఆసుపత్రికి అందించింది. కాగా టెక్నికల్ స్టాఫ్ లేకపోవడంతో ఇంతవరకు ఈ సేవలు ప్రజలకు అందుబాటులోకి రాలేదు. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక ఎమ్మెల్యే, కొణతాల రామకృష్ణ, జిల్లా కలెక్టర్ దీనిపై ప్రధానంగా దృష్టి సారించారు. వారి చొరవతో సిబ్బంది నియామకం జరిగింది. సిటీ స్కాన్ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఒక రేడియాలజిస్ట్, ఇద్దరు టెక్నీషియన్లు, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్లను ప్రభుత్వం నియమించింది. కాగా ఇకపై పేదలు ఒక రూపాయి ఖర్చు లేకుండా ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో సిటీ స్కానింగ్ సేవలను ఉచితంగా పొందవచ్చు. ప్రారంభమైన మొదటి రోజే తలకు తీవ్ర గాయాలైన ఇద్దరు వ్యక్తులకు సిటీ స్కానింగ్ చేశారు.



**సిటీ స్కాన్ సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి:**

ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రిలో బుధవారం ప్రారంభమైన సిటీ స్కాన్ సేవలను వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. : రేడియాలజిస్ట్ డాక్టర్ అర్ఫియా రహీం ఇతర సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆసుపత్రిలో అందుబాటులోకి వచ్చిన సిటీ స్కాన్ అత్యాధునిక పరికరం అన్నారు. 32 స్లైస్ తో కూడిన ఈ పరికరం రోగ నిర్ధారణకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. కాగా ప్రస్తుతం సిబ్బంది కొరత కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకే ఈ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. టెలి రేడియాలజీ అండర్ ప్రాసెసింగ్ లో ఉందన్నారు. ఇది అందుబాటులోకి వస్తే ప్రజలకు 24 గంటలు సిటీ స్కాన్ సేవలు లభ్యమవుతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం తలకు తగిలిన దెబ్బలకు సంబంధించి సమాచారాన్ని తెలుసుకునేందుకు ఈ సిటీ స్కాన్ ను వినియోగిస్తున్నామని తెలిపారు. కాగా ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎట్టకేలకు ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రిలో సిటీ స్కాన్ సేవలను పున ప్రారంభించిన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పనితీరు పట్ల ప్రజల నుంచి ప్రశంసల జల్లు కురుస్తోంది.

## పంచాయతి సమస్యలపై వినతి పత్రం
# అందజేసిన సొందే రమేశ

**ఎటపాక, అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):** ఎటపాక మండలం లక్ష్మీపురం గ్రామ పంచాయతీ పరిధిలోని పట్టుచీర గ్రామంలో పది సంవత్సరాల నుండి సింగల్ ఫేస్ ట్రాన్స్ఫార్మర్ వలన లోవోల్టేజ్ విద్యుత్ అంతరాయంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు పట్టుచీర గ్రామ సమీపంలో ఉన్న కొత్తగుంపులో నివాసం ఉంటున్న 15 కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం లేదు. వీరు తాత్కాలికంగా కిలోమీటర్ దూరం నుండి సర్వీస్ వైరు ద్వారా విద్యుత్ సప్లై పొందుతున్నారు. అలాగే లక్ష్మీపురం, గౌరీదేవిపేట, నెల్లిపాక గ్రామాలలో నూతనంగా హాస్పిటల్ భవనా లను నిర్మించారు. పైభాగంలో రూఫ్ లేకపోవడం చేత రోగుల పైన హాస్పటల్ సిబ్బంది పైన, కోతులు దాడులు చేస్తున్నాయి. దీంతో రోగులు, హాస్పిటల్ సిబ్బంది భయభ్రాంతులకు గురవుతూ గాయాల పాలవుతున్నారు. కావున ఐరన్ మెస్ తక్షణమే ఏర్పాటు చేయాలని, గత ప్రభుత్వంలో గ్రామ సచివాలయం భవనాలను నిర్మాణ పనులు తొలి దశలో ఆగిపోయిన్నాయి తక్షణమే పనులు వేగవంతం చేయాలని, రైతు భరోసా కేంద్రం పనులు చేపట్టాలని ఈ రోజు చింతూరులో జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవికి లక్ష్మీపురం వార్డ్ నెంబర్ సొంది రమేష్ సమస్యలను వివరించి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సమస్యపై ఎమ్మెల్యే స్పందించారు. ఈ సమస్య త్వరగా పరిష్కారం చేస్తా అని హామీ ఇచ్చినారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం గ్రామస్తులు, పట్టుచీర గ్రామస్తులు పాల్గొన్నారు.



## లక్ష్మీపురంలో ఘనంగా ప్రభాస్ పుట్టిన రోజు వేడుకలు



**ఎటపాక, అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):**ప్రముఖ సినీ నటుడు ప్రభాస్ పుట్టినరోజు వేడుకలను మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక రెబల్ యూత్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత కేక్ కట్ చేసి అభిమానులు ప్రభాస్‌కు అభినందనలు తెలుపుకున్నారు. అనంతరం యూనియన్ లీడర్ రంబాల కార్తీక్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టుచీర గ్రామంలో యంపిపి పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు నోట్ బుక్స్ పెన్నులు పెన్సిల్స్ ఎలెజర్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు మాట్లాడుతూ ప్రముఖులకు అభిమానులుగా ఉండటం ఒక ఎత్తైతే వారి వారి ప్రత్యేక రోజుల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. ఈ వేడుకల్లో రెబల్ యూత్ ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు రంబాల.కార్తీక్, వాసం రాము, కణితి.రాజు, జువ్వల .మధు, సతీష్,వాసం రాంబాబు, సవాలం .శ్రీకాంత్ వెంకటేష్, వీరు,వాసం. జంపన్న,కణితి సురేష్, కల్లూరి.వెంకటేష్ పాల్గొన్నారు.

# హత్య కేసులో మాజీ మంత్రి విశ్వరూప్ కుమారుడు శ్రీకాంత్ అరెస్టు

### మధురై నుంచి కొత్తపేట డిఎస్పీ కార్యాలయానికి తరలింపు

**కొత్తపేట, అక్టోబర్ 22 (ఆంధ్రపత్రిక):**అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి గ్రామానికి చెందిన జనపల్లి దుర్గాప్రసాద్ (జనప) అనే వ్యక్తి హత్య కేసులో మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ కుమారుడు శ్రీకాంత్‌ను పోలీసులు అరెస్టు చేశారు. తమిళనాడులోని మధురైలో ఈనెల 20వ తేదీ రాత్రి శ్రీకాంత్‌ను అరెస్టు చేసిన స్పెషల్ టీం పోలీసులు మంగళవారం రాత్రికి కొత్తపేట డీఎస్పీ కార్యాలయానికి తరలించారు. డిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వై.గోవిందరావు వివరాలు వెల్లడించారు. అయినవిల్లి గ్రామానికి చెందిన జనపల్లి దుర్గాప్రసాద్ 2022 జూన్ 6వ తేదీన అదృశ్యమైనట్టు భార్య శ్రావణి సంధ్య చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ జరుగుతున్న సమయంలో జూన్ 10వ తేదీన కోటిపల్లి రేవులో దుర్గాప్రసాద్ మృతదేహం లభ్యమైంది. పోస్ట్ మార్టం నివేదికలో అతనిని మెడకు తాడు బిగించి హత్య చేసినట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో హత్య కేసుగా మార్చి పి.గన్నవరం సిఐ దర్యాప్తు చేపట్టారు. అనుమానితుల కదలికలు, ఫోన్ కాల్స్ డేటా ఆధారంగా ఈనెల 18వ తేదీన డీఎస్పీ గోవిందరావు వడ్డీ ధర్మేష్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. విచారణలో అతను చెప్పిన వివరాలను బట్టి పినిపే శ్రీకాంత్‌కు, హతుడు దుర్గాప్రసాద్‌ల మధ్య మనస్పర్ధలు ఉన్నట్టు తేలింది. ఈ కారణంగానే దుర్గాప్రసాద్‌ను చంపడానికి పథకం వేశారు. 2022 జూన్ 6వ తేదీన దుర్గాప్రసాద్‌ను కోటిపల్లి రేవు వద్దకు రప్పించి నలుగురు వ్యక్తులు కలిసి హత్య చేసినట్టు చెప్పడంతో ప్రధాన నిందితుడు శ్రీకాంత్‌ను అరెస్టు చేయడం కోసం జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు స్పెషల్ టీం ఏర్పాటు చేశారు. పోలీసులు అరె స్టు చేస్తారనే భయంతో శ్రీకాంత్ హైదరాబాద్‌కు, అక్కడి నుంచి తమిళనాడుకు పారిపోయాడని డీఎస్పీ తెలిపారు. తమిళనాడులో అతను ఫోన్ స్విచ్ఛాఫ్ చేసినట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో స్పెషల్ టీం పోలీసులు అక్కడకు చేరుకుని ఈనెల 20వ తేదీ రాత్రి 8.20 గంటలకు మధురైలో శ్రీకాంత్ ను అరెస్టు చేశారు. తిరుమంగళం కోర్టులో మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచి అక్కడి నుంచి మంగళవారం రాత్రికి కొత్తపేట డీఎస్పీ కార్యాలయానికి తరలించారు. అయితే మీడియాకు చూపకుండానే నిందితుడిని అమలాపురం మెజిస్ట్రేట్ వద్దకు తరలించడం గమనార్హం.



## రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం

### సబల్ ప్రాజెక్టు ద్వారా పండ్ల మొక్కలు పంపిణీ

**వేపాడ,అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):** మండలంలో వీలుపర్తి, ఎన్.కే.ఆర్ పురం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ్యవసాయాధికారి సి.బి యశ్వంత రావు ఆధ్వర్యంలో బుదవారం నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఉద్యానశాఖ ద్వారా రైతులకు అందుబాటులో ఉండటం,ఈ శాఖల ద్వారా ప్రభుత్వం అందించే అన్ని పథకాలు గురించి అన్ని సౌకర్యాలు గురించి రైతులకు తెలియజేసి వారి వారి సంక్షేమం కోసం పనిచేయడం కోసం పొలం పిలుస్తోంది నిర్వహించడం జరుగుతుందని వ్యవసాయాధికారి సీ.బీ యశ్వంతరావు తెలిపారు.అదేవిధంగా ఎన్.కె.ఆర్ పురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సబల్ ప్రాజెక్టు ద్వారా అందించినటువంటి పండ్ల మొక్కలను పంపిణీ చేసారు.రైతులతో కలిసి పొలాన్ని సందర్శించడం పొలంలో గుర్తించిన పురుగులు తెగుళ్ల గురించి రైతులకు అవగాహన కల్పించడం మెరుగైన యాజమాన్య పద్ధతులు గురించి తెలియజేసి పకృతి వ్యవసాయం పద్ధతులు పాటించాలని సూచించారు.ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సుడిదోమ నివారణకు తూటికాడ కషాయం వాడుకోవాలని రైతులకు తెలియ జేసారు. అలాగే రైతులకు కషాయాలను పంపిణీ చేసారు. అదేవిధంగా రైతులు అందరూ వ్యవసాయానికి అవసరమైన ఆధునిక యంత్రాలు,యంత్ర పరికరాల కొరకు,కాషాయాల పిచికారీ కొరకు స్ప్రేయర్లు మరియు తార్ఫన్‌లు కొరకు రైతు సేవా కేంద్రం నందు రైతులు పేరు నమోదు చేసుకోవాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వి.హెచ్.ఎ జ్యోతి, వి.ఎ.ఎ ప్రసాద్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎం.టి సన్యాసమ్మ,నారాయణమ్మ,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు హాజరయ్యారు.



## అనాధికార అక్రమ కలప రవాణాదారులపై కఠిన చర్యలు

### - రేంజర్ శ్రీనివాస రావు




**డుంబ్రిగుడ, అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):**మండలంలోని పలుచోట్ల అధికారికంగా అక్రమంగా కలప రవాణాకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తప్పదని అరకు రేంజ్ అటవీశాఖ అధికారి రేంజర్ శ్రీనివాస్ రావు హెచ్చరించారు. సెక్షన్ ఆఫీసర్ల ప్రోద్ బలంతో సావ్వ పంచాయితీ పరిధిలోనున్న గొప్పల వలస, కాంగ్ వలస, మాలివలస, పనస వలస, ఒడియా వలస, సోవ్వ గ్రామాల నుండి అక్రమంగా సిల్వర్ ఓక్, నీలగిరి, అకేసియా కలప ఒడిశా రాష్ట్రానికి రవాణా జరుగుతున్నట్లు ఇటీవల పలు పత్రికల్లో వచ్చిన కథనాలను స్పందించిన ఆయన బుధవారం ఆయా గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో గల తోటలను పరిశీలించడం జరిగిందన్నారు. అయితే అక్కడక్కడ అకేసియా సిల్వర్ ఓక్ నీలగిరి అనాధికారంగా తరలించేందుకు కలపను సిద్ధం చేసి ఉన్నట్లు గుర్తించమన్నారు. దీనిపై వాస్తవాలు వెలికి తీసి చర్యలు తీసుకోవడానికి ఉన్నత స్థాయి అధికారులకు నివేదిక అందిస్తామన్నారు. ఆయన వెంట అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగానికి అండగా ఆప్కాబ్

### రాయుడుపేట, జాకేరు గ్రామాల్లో మూడు గిడ్డంగుల నిర్మాణం
### పంటదినుసులు, ఎరువులు విత్తనాల నిల్వకు భరోసా





**వేపాడ, అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):** మండలంలోని రాయుడుపేట,జాకేరు గ్రామాల్లో ఆప్కాబ్,నాబార్డు నిధులతో నిర్మిస్తున్న గిడ్డంగుల్లో పంటదినుసులు, ఎరువులు,విత్తనాలు నిల్వ చేసుకొని అవసరమైనపుడు తీసుకొనే అవకాశం త్వరలో రైతులకు కలగనుంది. రాయుడుపేటలో ఇప్పటికే 500మెట్రిక్ టన్నుల కెపాసిటీ గల గిడ్డంగిని రూ 40లక్షల వ్యయంతో నిర్మించిన అదికారులు అదే ప్రాంతంలో కొత్తగా రూ 80లక్షల వ్యయంతో వెయ్యి మెట్రిక్ టన్నుల కెపాసిటీ గల మరో గిడ్డంగి నిర్మాణం కూడా శరవేగంగా జరుగుతోంది. అలాగే మండలంలోని జాకేరు గ్రామంలో రూ.40లక్షల వ్యయంతో 500మెట్రిక్ టన్నుల కెపాసిటీ గల మరో గిడ్డంగి నిర్మాణం కూడా శరవేగంగా జరుగుతోంది.వీటి నిర్మాణం పూర్తి చేసుకున్న తర్వాత ఈ మూడు గిడ్డంగులు రైతులకు ఇతోధికంగా ఉపయోగపడే అవకాశం ఉందని చెప్పవచ్చు.

## పాలు రేట్లు పెంచాలని డిమాండ్



**మునగపాక, అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):** మునగపాక మండలంలో వెంకటాపురం పాల ఉత్పత్తి దారుల సంస్థ ఎదురుగా బుధవారం పాల రైతులు సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ గేదె పాలు లీటర్ 100 రూపాయలు, ఆవు పాలు లీటర్ 50 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాల రైతులకు బోనస్ వెంటనే చెల్లించాలని, పశుదాన ఖర్చులు ఆధారంగా పాలధార పెంచాలని డిమాండ్ చేశారు. విశాఖ డైరీ అవినీతి అక్రమాలపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. రైతులు అనేక ఇబ్బందులు పడుతూ పశు దాన ఖర్చులు పెరగడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పాలధార పెంచవలసిన యాజమాన్యం లీటర్ ఐదు రూపాయలు ధర తగ్గించడం దుర్మార్గం అన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించకపోతే విశాఖ డైరీ ఎదుట ఆందోళన చేపడతామని గనిశెట్టి హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సిరి వరహాల రాజు, ఏదూరి రమణ, పండూరి తాతయ్య, చిన్ని రామారావు, సుందరపు అప్పారావు, పండూరి లక్ష్మి, కే.నాగరాజు, పి.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

## రాయుడు పేట రోడ్డును పట్టించుకోండి ఎమ్మెల్యే గారూ!

### నిధులు మంజూరు చేసి రోడ్డు పనులు పునః ప్రారంభించండి.
### వేడుకుంటున్న రాయుడుపేట గ్రామస్తులు.



**వేపాడ, అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):** మండలంలోని వీలుపర్తి శివారు రాయుడుపేట రోడ్డు నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే అయిన కోళ్ళ లలితకుమారి అవసరమైన నిధులను మంజూరు చేసి రోడ్డు పనులను పునః ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గతంలో మీరు ఎమ్మెల్యేగా ఉన్నపుడు రాయుడు పేట రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయగా వేపాడ - వీలుపర్తి రోడ్డు నుంచి రాయుడుపేట గ్రామం వరకూ తారు రోడ్డు నిర్మించగా అక్కడ నుండి చలుమూరివానిపాలెం వరకూ నిర్మించాల్సిన రోడ్డుకు సంబంధించి ఏర్పడిన వివాదం వల్ల సంబందిత కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా నిలిపి వేసిన సంగతి అందరికీ తెలిసిందే.ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ రోడ్డు నిర్మాణం గురించి కనీసం పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు.మళ్లీ ఇపుడు ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడం,ఎస్.కోట ఎమ్మెల్యేగా తిరిగి కోళ్ళ లలితకుమారి ఎన్నిక కావడం శుభపరిణామమని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ఏళ్ళ తరబడి అసంపూర్తిగా ఈ రోడ్డు నిర్మాణం నిలిచిపోవడంతో వేపాడ నుంచి రాయుడుపేట మీదుగా దేవరాపల్లి,చోడవరం,కొత్తవలస,కోటపాడు తదితర ప్రాంతాల వైపు వెళ్ళే ప్రజలు ఆనేక విధాలుగా ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యేగా చొరవ తీసుకుని రోడ్డు నిర్మాణంను పూర్తి చేసి ప్రజల మన్ననలను పొందాలని రాయుడుపేట గ్రామస్తులు కోరుతున్నారు.

# ఎపి సర్కార్ కీలక నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

కమిషన్ (ఏపీపీఎస్సీ) ఛైర్‌పర్సన్‌గా రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏఆర్.అనురాధను నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బుధవారం మధ్యాహ్నం ఏపీ చీఫ్ సెక్రటరీ నీరభ్ కుమార్ అనురాధను ఏపీపీఎస్సీ ఛైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.కొన్ని రోజుల క్రితం ఏపీపీఎస్సీ ఛైర్మన్‌గా ఉన్న గౌతమ్ సవాంగ్ తన పదవికి రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్ప డింది. ప్రస్తుతం ఆ పదవి ఖాళీగా ఉండడంతో భర్తీ చేయడానికి ప్రభుత్వం రంగంలోకి దిగింది. అనురాధ గతంలో ఇంటె లిజెన్స్ చీఫ్, హోంశాఖ కార్యదర్శిగా కీలక బాధ్యతలు నిర్వహించిన ఆమె అయితే సమర్థవంతంగా పనిచేయగలరని భావించి ఆమెకు అవకాశం కల్పించింది ఏపీ సర్కార్.ప్రభుత్వం ఏపీపీఎస్సీ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అనువైన అధికారిగా.. ఏపీ క్యాడర్‌కు చెందిన అనురాధను ప్రభుత్వం నియమించింది. అనురాధ ఏపీలో ఇంటెలిజెన్స్ విభా గానికి అధిపతిగా పనిచేసిన తొలి మహిళా ఐపీఎస్ అధికారిగా గుర్తింపు పొందారు. వీటితో పాటుగా డీజీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో కూడా ఆమె కీలక పాత్ర పోషించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పలు జిల్లాల్లో ఎస్పీగా, ఐజీగా ఆమె సేవలు అందించారు. 1987 బ్యాచ్‌కు చెందిన అనురాధ భర్త నిమ్మగడ్డ సురేంద్రబాబు కూడా ఐపీఎస్ అధికారి కావడం విశేషం.వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ గ్రూప్స్ పరీక్షల నిర్వహణలో అక్రమాలు జరిగాయని టీడీపీ తీవ్రంగా ఆరోపిం చింది. ముఖ్యంగా గ్రూప్-1 పరీక్షల మూల్యాంకనంలో వివాదాస్పద నిర్ణయాలు తీసుకుని, కొంతమంది అభ్యర్థులకు అన్యా యం చేశారని విమర్శలు వచ్చాయి. ప్రభుత్వం మారిన వెంటనే, సవాంగ్ పదవీ కాలం ఇంకా ఉండగా కూడా ఏపీపీఎస్సీ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. దీంతో తాజాగా ప్రభుత్వం అనురాధను ఏపీపీఎస్సీ ఛైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# రేపటికి తీవ్ర తుపానుగా దానా..!

(మొదటిపేజీ తరువాయి)

దాటే అవకాశముందని వెల్లడిం చింది. పూరీ (ఒడిశా), సాగర ద్వీపం (పశ్చిమబెంగాల్) మధ్య భితార్కానికా, ధమ్రా సమీపంలో తీరం దాటనున్నట్లు పేర్కొంది.గడిచిన 6 గంటల్లో తుపాను గంటకు 15 కి.మీ వేగంతో ముందుకు కదులుతోందని తెలిపింది.ప్రస్తుతం పరదీప్ (ఒడిశా)కి 520 కి.మీ., సాగర్ ద్వీపానికి 600 కి.మీ, ఖేపు పరా (బంగ్లాదేశ్)కి 610 కి.మీ దూరంలో దానా తుపాను కేంద్రీకృతమైనట్లు వెల్లడించింది. దీని ప్రభావంతో నేటి మధ్యాహ్నం నుంచి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని తీర ప్రాంతం వెంబడి గంటకు 80- 100కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని తెలిపింది. బుధ, గురువారాల్లో సముద్రం అలజడిగా ఉంటుందని.. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ సూచించారు.

**రైల్వేశాఖ అప్రమత్తం...**

దానా తుపాను నేపథ్యంలో తూర్పు కోస్తా రైల్వే అప్రమత్తమైంది. ఇప్పటికే పలు రైళ్లను రద్దు చేయగా.. మరి కొన్నింటిని దారి మళ్లించింది. ప్రయాణికులకు రైళ్ల సమాచారం తెలిపేందుకు వివిధ స్టేషన్లలో హెల్ప్ లైన్ కేంద్రాలు ఏర్పాటు చేసింది. సమాచారం కోసం ఈ క్రింది నెంబర్లకు ఫోన్ చేయాలని తెలిపింది.

# వైసిపి మరో షాక్

(మొదటిపేజీ తరువాయి)

నాయకులు జగన్‌కు గుడ్ బై చెబుతూ పార్టీని విడుతున్నారు. ఇప్పటికే పలువురు నాయకులు పార్టీకి రాజీనామా చేశారు. తాజాగా ఆ పార్టీ మహిళా నేత వాసిరెడ్డి పద్మ కూడా రాజీనామా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ నుంచి ఆమె టికెట్ ఆశిం చారు. జగన్ మాత్రం ఆమెకు టికెట్ ఇవ్వలేదు. దీంతో కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్న వాసిరెడ్డి పద్మ.. బుధవారం పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను జగన్ కు పంపారు. ఇందులో జగన్ విధానాలను తీవ్రంగా విమర్శించారు. గుడ్ బుక్ పేరుతో మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కార్యకర్తల కోసం గుడ్ బుక్ కాదు..గుండె బుక్ కావాలన్నారు. జగన్‌వి అప్రజాస్వామిక పద్ధతులు, నియంతృత్వ ధోరణి, సమాజం పట్ల, పాలనలో, పార్టీని నడపడంలో జగన్ బాధ్యతగాలేరని వాసిరెడ్డి పద్మ విమర్శలు చేశారు. వైకాపా పాలనలో మాజీ సీఎం జగన్ ప్రజలను అన్నివిధాలుగా మోసం చేశారు. ప్రభుత్వ మద్యం పేరిట పేద ప్రజలను దోచుకున్నారు. ఐదేళ్ల పాలనలో ఎప్పుడూ ప్రజా సమస్యలను పట్టించుకోలేదు. వైకాపాలో మహిళలకు ఎలాంటి ప్రాధాన్యత లేదు. ఎన్నో అవమానాలు ఎదురైనా క్రమశిక్షణ కలిగిన నేతగా పార్టీ కోసం పనిచేశాను. మహిళలపై జరుగుతున్న దాడులను వైకాపా రాజకీయంగా వాడుకోవడం బాధాకరం. గత ప్రభుత్వం హయాంలోనూ అనేక దాడులు జరిగాయి. సీఎం హోదాలో జగన్ ఎప్పుడూ బాధితులను పరామర్శించలేదు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, దాడులను ఆయన దృష్టికి తీసుకెళ్లినా కనీస చర్యలు తీసుకోలేదు. పార్టీని నడిపించడంలో, పాలనలో జగన్‌కు బాధ్యత లేదు. నియంతృత్వ ధోరణిని ప్రజలు మెచ్చుకోరని ఎన్నికల తీర్పు స్పష్టం చేసింది. జగన్ 'గుడ్ బుక్' పేరుతో మరోసారి మోసానికి సిద్ధమయ్యారు. నాయకులు, కార్యకర్తల కోసం ఉండాల్సింది 'గుడ్ బుక్' కాదు 'గుండె బుక్' అని వాసిరెడ్డి పద్మ పేర్కొన్నారు.కాగా, వైసీపీ హయాంలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా ఆమె బాధ్యతలు నిర్వహించారు.

# జగన్ కుటుంబంలో మరోసారి ఆస్తి వివాదం?

(మొదటిపేజీ తరువాయి)

వాటాల కేటాయింపు పై వీరిద్దరి పై పిటిషన్లు వేశారు జగన్. ఆస్తి పంపకాల విషయంలో విజయమ్మ, షర్మిల పై నేషనల్ కంపెనీలా ట్రిబ్యునల్‌లో జగన్ ఫిర్యాదు చేయడం సంచలనంగా మా రింది.సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ షేర్ల వివాదం పై క్లాసిక్ రియాల్టీ ప్రైవేట్ లిమిటెడ్ షేర్ల వివాదం పై క్లాసిక్ రియాల్టీ ప్రైవేట్ లిమి టెడ్, జగన్ , భారతి రెడ్డి పేర్లతో 5 పిటిషన్లు వేశారు. వాస్తవానికి ఆగస్టు 21, 2019 ఎంవోయూ ప్రకారం.. విజయమ్మ, షర్మిలకు షేర్లు కేటాయించామని..పలు కారణాలతో కేటాయింపు జరగలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం దీని గురించి పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

# జగన్ తీరు మారాలి

(మొదటిపేజీ తరువాయి)

చేలో పడ్డట్టుగా వ్యవహ రిస్తున్నారంటూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఎద్దేవా చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మాలనే ప్రయ త్నంలో నోటి కొచ్చిందల్లా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. జగన్ పాలనలో మహిళలపై జరిగినన్ని దాడులు ఇంకెప్పుడైనా జరిగాయా అని ప్రశ్నించారు. ఐదేళ్లలో 2 లక్షలకు పైగా కేసులు నమోదైతే.. వాటిని నిరోధించేందుకు అసలు చర్యలు తీసుకున్నారా అని నిలదీశారు. తన ఇంటి పక్కనే దళిత యువతిపై గ్యాంగ్ రేప్ జరిగితే నిందితుడు వెంకటరెడ్డిని ఐదేళ్ల పాటు అరెస్ట్ చేయకుండా చోద్యం చూసిన జగన్.. శాంతిభద్రతల గురించి మాట్లాడుతుంటే సిగ్గేస్తుందంటూ వ్యాఖ్యలు చేశారు. తన నియోజకవర్గంలోనే దళిత మహిళ నాగమ్మపై ఆత్యాచారం జరిగితే జగన్ కనీసం పట్టించుకున్నారా అని మండిపడ్డారు. జగన్ రెడ్డి తన పాలనలో యువతను గంజాయి, డ్రగ్స్, నాసిరకం మద్యానికి అలవాటు చేసి వారిని పెడదారి పట్టించారని విమర్శించారు. ఆ ప్రభావంతోనే సైకోలుగా మారిన మగాళ్లు మహిళలపై దాడులు కొనసాగిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం నేరాలను ఉక్కుపాదంతో అణిచివేస్తోందని స్పష్టం చేశారు. మహిళలపై దాడులు జరిగిన ఘటనల్లో వెనువెంటనే పార్టీలకు, కులాలకు, ప్రాంతాలకు అతీతంగా నిందితులను అరెస్ట్ చేసి శిక్షిస్తున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.

# ఎపికి మరిన్ని పెట్టుబడులు రావాలి

(మొదటిపేజీ తరువాయి)

కొరియాకు చెందిన పలు సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. చెన్నైలోని కొరియా కాన్సులేట్ జనరల్ కిమ్ చాంగ్ యన్తో పాటు కొరియన్ ఎగ్జిమ్ బ్యాంక్ ఈడీసీఎఫ్ ఆపరేషన్స్ డిపార్ట్మెంట్-2 డైరెక్టర్ జనరల్ కెవిన్ చోయ్, ఎగ్జిమ్ బ్యాంక్ ఎన్టీఆర్వో ముఖ్యప్రతినిధి జంగ్ వాన్ రియా, కొరియా ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజెన్సీ డైరెక్టర్ చాంగ్ వూ చాన్ సచివాలయంలో మంత్రి లోకేశ్తో సమావేశమయ్యారు. పెట్టుబడులకు గల అవకాశాలపై చర్చించారు.రాష్ట్రంలో చేపడుతున్న పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు సహకారం అందించేందుకు ఎగ్జిమ్ బ్యాంక్ సంసిద్ధత వ్యక్తం చేసింది. రాష్ట్రంలో పెట్టుబడుల అనుకూల వాతావరణం కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, అందిస్తున్న రాయితీలను ఈ సందర్భంగా ఎగ్జిమ్ బ్యాంకు ప్రతినిధులకు మంత్రి లోకేష్ వివరించారు. పరిశ్రమలకు త్వరితగతిన అనుమతుల మంజూరు కోసం ఈడీబీని పునరుద్ధరించామన్నారు. ఏపీ అభివృద్ధిలో కొరియా సంస్థలు భాగస్వామ్యం కావాలని ఈ సందర్భంగా కోరారు.

# సూపర్ సిక్స్‌లో తొలి అడుగు

(మొదటిపేజీ తరువాయి)

దీపావళి రోజున ప్రారంభిస్తాం అని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.రాష్ట్రంలో అర్హత ఉన్న మహిళలకు మూడు గ్యాస్ కంపెనీల ద్వారా అందిస్తున్నాం. అక్టోబర్ 31న డెలివరీ జరిగేలా చూడాలని సీఎం చెప్పారు. 894.92 రూపాయలు డిబిటిఏ ద్వారా ఏర్పాటు చేస్తున్నం. వచ్చే సంవత్సరం నుంచి బ్లాక్ పీరియడ్ విధానం ఉంటుంది.సిలిండర్ డెలివరీ అయిన 48 గంటలలోపే లబ్ధిదారుల అకౌంట్ కే డబ్బులు వచ్చేస్తాయి. గ్రామ వార్డు సచివాలయాల్లో ఒక ఆఫీసు ఏర్పాటు చేసి ఎలాంటి సమస్యలున్నా పరిష్కరిస్తాం. ఈ అక్టోబర్ నుంచీ మార్చి వరకూ మొదటి సిలిండర్ వస్తుంది.

# మహావికాస్ అఘాడీలో సీట్ల సర్దుబాటు

**ముంబయి,అక్టోబర్ 23 :** త్వరలో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) 38 మంది అభ్యర్థులతో కూడిన మొదటి జాబితాను విడుదల చేసింది. పార్టీ అధినేత అజిత్ పవార్ అతడి కుటుంబానికి కంచుకోట అయిన బారామతి స్థానం నుంచి పోటీ చేస్తారని ప్రకటించింది.

# ఉగ్రవాదంపై మనమంతా పోరాడాలి

(మొదటిపేజీ తరువాయి)

కలిసికట్టుగానే ఎదుర్కోవలసి ఉంటుందన్నారు. ఇలాంటి అంశాల్లో ద్వంద్వ ప్రమాణాలు సరికాదన్నారు. ఉగ్రవాదం, ఉగ్రవాదులకు నిధుల సరఫరా అనేవి చాలా తీవ్రమైన సమస్యలు. వీటిని చాలా సమర్థవంతంగా ఎదుర్కోవాలి. ఇందుకు అంతా కలిసికట్టుగా పనిచేయాలి' అని మోదీ సూచించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర నేరుగా ఏ దేశం పేరును ప్రస్తావించకపోయి నప్పటికీ ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తున్న పాకిస్థాన్‌కు చైనా ఆర్థిక సహాయాన్ని ఎండగట్టారు. ప్రపంచ శాంతికి విఘాతం కలిగించే రాడికలైజేషన్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. యువతను అతివాదులుగా మారేందుకు ప్రేరేపించడాన్ని సమష్టిగా ప్రపంచదేశాలు అడ్డుకోవాలని అన్నారు. అంతర్జాతీయ తీవ్రవాదంపై యూఎన్ కాంప్రహెన్సివ్ కన్వెన్షన్‌లో ప్రస్తావించిన పెండింగ్ అంశాలపై కూడా అంతా కలిసికట్టుగా పనిచేయాలని సభ్యదేశాలకు మోదీ పిలుపునిచ్చారు. సైబర్ సెక్యూరిటీ అనేది కీలకమని, సైబర్ సెక్యూరిటీ, సేఫ్, సెక్యూర్ ఏఐపై అంతర్జాతీయ రెగ్యులేషన్లపై సభ్యదేశాలు కలిసకట్టుగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మోదీ అన్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి, డబ్ల్యూటీఓ వంటి గ్లోబల్ సంస్థల్లో కూడా ఎప్పటికప్పుడు సంస్కరణలు తెచ్చేందుకు ముందుకు రావాలని సూచించారు. చర్చలు, దౌత్యానికి భారత్ బాసటగా నిలుస్తుందని, యుద్ధానికి కాదని ప్రధాని మరోసారి స్పష్టం చేశారు.



ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం, ఆహారం, నీరు, ఇంధనం, ఆరోగ్యం వంటి అంశాలు అన్ని దేశాలకు ప్రాధాన్యతాంశాలని అన్నారు. 'బ్రిక్స్' అంటే విభజన గ్రూప్ కాదని, పబ్లిక్ ఇంట్రస్ట్ గ్రూప్ అనే స్పష్టమైన సందేశాన్ని ప్రపంచ దేశాలకు మనం ఇవ్వాలని అన్నారు. బ్రిక్స్ భాగస్వామ్య దేశంగా కొత్త కొత్తదేశాలకు స్వాగతం పలికేందుకు ఇండియా సిద్ధంగా ఉందని మోదీ స్పష్టం చేశారు. అయితే ఇందుకు సంబంధించిన నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా తీసుకోవాల్సి ఉంటుందన్నారు. బ్రిక్స్ వ్యవస్థాపక దేశాల అభిప్రాయాలను గౌరవించాల్సి ఉంటుందన్నారు. జోహెన్నెస్‌బర్గ్ సమ్మిట్‌లో అంగీకరించిన సిద్ధాంతాలు, ప్రమాణాలు, క్రైటీరియా, ప్రొసీజర్‌ను తూచ తప్పకుండా సభ్యదేశాలు పాటిస్తూ ముందుకు వెళ్లాలని దిశానిర్దేశర చేశారు.రష్యాలోని కజన్‌లో జరుగుతోన్న బ్రిక్స్ దేశాల 16వ శిఖరాగ్ర సదస్సులో కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత్ ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. సరిహద్దు గస్తీపై జరిగిన ఒప్పందాన్ని ఇరువురు నేతలు స్వాగతించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. సరిహద్దులో శాంతి, సుస్థిరతను కాపాడుకోవడం ఇరు దేశాల ప్రాధాన్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఐదేళ్ల తర్వాత అధికారికంగా సమావేశం అవుతున్నాం. భారత్-చైనా సంబంధాలు ఇరు దేశాల ప్రజలకే కాకుండా ప్రపంచ శాంతి, సుస్థిరత, పురోగతికి ఎంతో ముఖ్యమని విశ్వసిస్తున్నాం. గత నాలుగేళ్లుగా సరిహద్దులో తలెత్తిన సమస్యలపై ఇటీవల వచ్చిన ఏకాభిప్రాయాన్ని స్వాగతిస్తున్నాం. సరిహద్దులో శాంతి, సుస్థిరతను కాపాడుకోవడం మన ప్రాధాన్యంగా ఉండాలి. పరస్పర విశ్వాసం, గౌరవం, సున్నితత్వం అనేవి మన సంబంధాలకు ప్రాతిపదికగా ఉండాలి' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. గత ఐదేళ్లలో మోదీ-జిన్‌పింగ్‌లు అధికారికంగా చర్చలు జరపడం ఇదే తొలిసారి. వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి కొన్నేళ్లుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతూ కీలక గస్తీ ఒప్పందం కుదిరిన నేపథ్యంలో వీరి భేటీ మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

# మహిళలకు దీపావళి కానుక

(మొదటిపేజీ తరువాయి)

మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సీనరేజ్ ఛార్జీల రద్దు వల్లే ప్రభుత్వంపై రూ.264 కోట్ల భారమని అంచనా వేశారు. ఉచిత ఇసుక లక్ష్యం నెరవేర్చేందుకు నష్టం భరిద్దామని సీఎం చంద్రబాబు చెప్పినట్టు సమాచారం. పట్టా భూముల్లో ఎవరి ఇసుక వారు తీసుకునేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఉచిత ఇసుక సరిగా అమలయ్యేలా చూడాలని మంత్రులు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఇసుక లేని జిల్లాల్లో మినరల్ డీలర్లను పెట్టి ధరల నియంత్రణ చేపట్టాలని నిర్ణయించారు. ఇసుక విధానాన్ని అతిక్రమిస్తే ... పిడి యాక్ట్ పెట్టాలని కూడా ఆదేశించారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధవారం కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగ కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలను మంత్రులు పార్థసారథి, అనిత, నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర వివరించారు. కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఇసుక సీనరేజ్, జీఎస్టీ ఛార్జీలు రద్దుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని అన్నారు. పూర్తిగా ఉచితంగా ఇసుకను అందజేస్తున్నామని తెలిపారు. ఉచిత ఇసుకతో వ్యాపారం చేసే వారిపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఉచిత ఇసుకను అక్రమంగా రవాణా చేసినా, విక్రయించిన వారిపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఇసుక కొరత ఉన్న ఐదు జిల్లాలో ప్రత్యామ్నయ్య పాయింట్లు ఏర్పాట్లు చేయనున్నా మని వివరించారు. ఉచిత ఇసుకను ఇతర సరిహద్దు రాష్ట్రాలకు తరలించకుండా చెక్‌పోస్టులను బలోపేతం చేస్తామని, నిరంతరం సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలన్నింటినీ ఈ పోర్టల్ గెజిట్‌లో పొందుపరిచేందుకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. రూ. 20 కోట్ల ఆదాయం వచ్చే దేవాలయాల కమిటీల్లో ఇదివరకు ఉన్న 15 మంది గల సభ్యుల సంఖ్యను 17 కు పెంచేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుల్లో బ్రాహ్మణులకు, నాయీ బ్రాహ్మణులకు సభ్యత్వం ఇవ్వాలని నిర్ణయించారు. విశాఖ నర్సింగ్ కళాశాలలో ప్రస్తుతమున్న సీట్లను 25 నుంచి 100 సీట్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుందని పార్థసారథి తెలిపారు. ఇందులో 25 టీచింగ్ పోస్టులకు, 58 నాన్ టీచింగ్ పోస్టులు మంజూరు చేసిందన్నారు. మంగళగిరిలో 30 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా మారుస్తూ మంత్రి వర్గం తెలిపిందని మంత్రి వివరించారు. ప్రతి నియోజకవర్గంలో వంద పడకల ఆసుపత్రిని నిర్మించేందుకు గ్రీన్ సిగ్నల్ తెలిపిందని వెల్లడించారు. ఈ పథకానికి ప్రతి యేడాది రూ. 2, 684 కోట్లు వ్యయం అవుతుందని, పేద మహిళలకు దీపావళి కానుకగా ప్రకటించినందుకు మహిళల తరుపున మంత్రి అనిత ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.ఆలయ కమిటీల్లో బ్రాహ్మణులు, నాయీ బ్రాహ్మణులకు చోటు కల్పించేందుకు, సభ్యుల సంఖ్య పెంచే చట్ట సవరణకు కేబినెట్ ఆమోదం తెలిపింది. విశాఖకు చెందిన వివాదాస్పద పీఠాధిపతి స్వరూపానందేంద్రకు చెందిన శారదాపీఠానికి జగన్ ప్రభుత్వం అప్పనంగా కట్టబెట్టిన 15 ఎకరాల అత్యంత విలువైన భూమిని వెనక్కి తీసుకోవాలనే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్ తన గురువు, అత్యంత సన్నిహితుడైన స్వరూపానందేంద్ర కోరిందే తడవుగా.. భీమిలి పట్టణాన్ని ఆనుకుని కొత్తవలస గ్రామ పరిధిలో, సముద్ర తీరానికి దగ్గర్లో రూ.కోట్ల విలువ చేసే భూమిని ఎకరం రూ.లక్ష చొప్పున అడ్డగోలుగా ఇచ్చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమ భూ కేటాయింపులపై సమీక్షలో భాగంగా ఎన్డీయే ప్రభుత్వం దీన్ని గుర్తించింది.

# అక్టోబర్ 31న బ్యాంకులకు దీపావళి సెలవు

**న్యూఢిల్లీ,అక్టోబర్ 23:** దీపావళి సహా వివిధ రాష్ట్రాల్లో ఇతర పండగలు జరగనున్న నేపథ్యంలో.. బ్యాంకులకు వరుస సెలవులు రాబోతున్నాయి. కొన్ని చోట్ల వరుసగా 4 రోజుల పాటు బ్యాంకులు మూతపడనున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గోవా, కర్నాటక, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడుతో సహా అనేక రాష్ట్రాల్లో అక్టోబర్ 31న(గురువారం) దీపావళి జరుపుకుంటున్నారు. దీంతో ఆ రోజు ఈ రాష్ట్రాల్లో బ్యాంకులకు సెలవు. ఢిల్లీ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సహా అనేక రాష్ట్రాలు నవంబర్ 1న దీపావళి జరుపు కుంటున్నాయి.

ఆయా రాష్ట్రాల్లో శుక్రవారం సెలవు ప్రకటించారు. బ్యాంకులకు వెళ్లాలనుకుంటున్న వారు ఈ విషయాన్ని గమనించగలరు. ఇక విద్యా సంస్థలకు కశ్మీర్ ప్రభుత్వం 5 రోజులు సెలవులు ప్రకటించగా.. తమిళనాడు సర్కార్ అక్టోబర్ 31, నవంబర్ 1 తేదీలను సెలవులుగా నిర్ణయించింది.

# మిస్టరీగా హసీనా 'రాజీనామా లేఖ'

(మొదటిపేజీ తరువాయి)

షేక్ హసీనా 'రాజీనామా లేఖ' కారణమయ్యింది. ఆ లేఖ గురించి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు తాజా దుమారానికి తెరలేపాయి. ఇంతకీ ఏం జరిగిందంటే..! బంగ్లాదేశ్ అధ్యక్షుడు మొహమ్మద్ షహాబుద్దీన్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "ఆ రోజు షేక్ హసీనా ప్రధాన మంత్రి పదవికి రాజీనామా చేసినట్లు విన్నాను. అయినప్పటికీ దానిని ధ్రువీకరించేందుకు రాజీనామా లేఖ సహా నా దగ్గర ఎటువంటి ఆధారాలు లేవు. ఎంత ప్రయత్నించినా ఆ లేఖ లభ్యం కాలేదు. బహుశా లేఖ ఇచ్చేందుకు ఆమె (షేక్ హసీనా)కు సమయం ఉండకపోవచ్చు" అని పేర్కొన్నారు. ఇదే విషయంపై సైన్యాధిపతిని వాకబు చేయగా అక్కడ నుంచీ ఇదేవిధమైన సమాధానం వచ్చిందన్నారు.హసీనా రాజీనామా లేఖ గురించి అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలపై తాత్కాలిక ప్రభుత్వం అసహనం వ్యక్తం చేసింది. అధ్యక్షుడు విరుద్ధ ప్రకటనలు చేశారని ప్రస్తుత ప్రభుత్వ న్యాయ సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ పేర్కొన్నారు. "తన వద్ద హసీనా రాజీనామా లేఖ లేదని అంటున్నారు. ఆగస్టు 5న త్రివిధదళాధిపతుల సమక్షంలో జాతినుద్దేశించిన ప్రసంగంలో హసీనా రాజీనామా చేశారని.. తాను ఆమోదించానని అధ్యక్షుడు చెప్పారు. ఇప్పుడు మాత్రం తనవద్ద ఆ లేఖ లేదని చెబుతున్నారు" అని చెప్పారు. ఇదిలాఉంటే, రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలతో బంగ్లాదేశ్ ఇటీవల అట్టుడుకిపోయింది. అవి హింసాత్మకంగా మారడం, దాదాపు 300 మంది నిరసనకారులు ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలో షేక్ హసీనా అధికార నివాసాన్ని ఆందోళనకారులు ముట్టడించారు. దీంతో ఆగస్టు 5న దేశాన్ని వీడిన హసీనా.. భారత్‌కు వచ్చి ఆశ్రయం పొందారు. అనంతరం బంగ్లాలో కొత్త ప్రభుత్వం ఏర్పడి.. పరిస్థితులు కుదుటపడుతోన్న సమయంలోనే హసీనా రాజీనామా గురించి అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు మరోసారి ఆందోళనలకు కారణమయ్యాయి.

# అన్ని విద్యల్లో కన్నా వేద విద్య ఉన్నతమైనది..

**అమరావతి,అక్టోబరు 23 (ఆంధ్రపత్రిక):** ఎస్వీ వేద విజ్ఞాన పీఠం విద్యా ర్థులకు కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామి అనుగ్రహ భాషణంఅన్ని విద్యల్లోకన్నా వేద విద్య ఉన్నతమైనది కంచికా మకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామి అన్నారు. తిరుమలలోని ఎస్వీ వేద విజ్ఞాన పీఠంలో బుధవారం సాయంత్రం ఆయన వేద విద్యార్థులకు అనుగ్రహ భాషణం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు వేద విజ్ఞాన పీఠం అధ్యాపకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ వేద విద్యార్థులు ధర్మ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. వేదాలు అభ్యసించే విద్యార్థులకు స్వరూపం, స్వధర్మం, స్వభావం ముఖ్యమని చెప్పారు. ధర్మాన్ని తెలుసుకోవాలంటే వేదాలను తెలుసుకోవడం తప్పనిసరి అన్నారు. భారతదేశం సాధువులు, మహర్షులతో నడపబడుతున్న దేశమని తెలియజేశారు. మనం ధర్మం కోసం త్యాగం చేయాలి గానీ ధర్మాన్ని త్యాగం చేయకూడదని



పేర్కొన్నారు. వేదాల్లోని భావార్థం విస్తృతంగా ప్రచారం చేసినప్పుడే భావి తరా లకు మంచి జరుగుతుందని చెప్పారు. ధర్మ పరిరక్షణకు ఆహార, ఆలోచన నియామాలు పాటించాలని తెలిపారు. విద్యార్థులందరూ వేద విద్య పూర్తయ్యాక ధర్మానికి కార్యకర్తలుగా పనిచేసి సంస్కృత భాషను ప్రచారం చేయాలని సూచించారు. మన దేశానికి ధర్మం, ఆలయం, సంస్కృతి, ఆచారం ముఖ్యమని ఉపదేశించారు. దేశంలోని ప్రతి గ్రామంలో ఉన్న ఆలయాలను తిరుమల ఆలయ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. టీటీడీ చేస్తున్న అనేక కార్యక్రమాల్లో వేద విజ్ఞాన అభివృద్ధి కార్యక్రమం చాలా గొప్పదని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వేదవిజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ కుప్పా సుబ్రహ్మణ్య అవధాని, టీటీడీ ఎస్టేట్ ఆఫీసర్ శ్రీమతి విజయ లక్ష్మీ, అధ్యాపకులు, విశేష సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# బాంబు బెదిరింపులు..

(మొదటిపేజీ తరువాయి)

10 రోజుల్లో 170కి పైగా విమాన సర్వీ సులకు హెచ్చరికలు వచ్చాయి. వీటిపై విమానయానశాఖ విచారణ చేపడుతున్నటికీ, ఎయిర్‌లైన్స్ యాజమాన్యం తనిఖీలు చేస్తున్నా బెదిరింపులు మాత్రం ఆగం లేదు.అయితే బెదిరింపులు ఎక్కువగా సామాజిక మాధ్యమాల ద్వారా వస్తుండటంతో తాజాగా కేంద్ర ఎలక్ట్రానిక్, ఐటీ మంత్రిత్వశాఖ.. సోషల్ మీడియా ప్లాట్‌ఫాం 'ఎక్స్'పై ఆగ్రహం వ్యక్తం చేసింది. మంత్రిత్వశాఖ సంయుక్త కార్యద్శి సంకేత్ ఎస్ భోంద్వే.. విమానయానసంస్థ అధికారులు, ఎక్స్, మెటా వంటి ఇ సోషల్ మీడియా ప్రతినిధితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమాల పనితీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఎక్స్ వంటి మాధ్యమాల్లో వస్తున్న పుకార్లను నియంత్రించడంలో ఎలాంటి చర్యలు తీసుకు న్నారని ప్రశ్నించారు.కాగా గత కొన్ని రోజులుగా భారతీయ విమానయాన సంస్థలు నిర్వహిస్తున్న 120కి పైగా విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. నిన్న కూడా ఇండిగో, విస్తారా, ఎయిర్ ఇండియాకు చెందిన 30 విమానాలకు ఇలాంటి బెదిరింపులు అందాయి. అయితే అధికారులు అప్ర మత్తమై భద్రతా ప్రోటోకాల్‌లను అనుసరించారు.ఈ పరిస్థితిపై పౌర విమానయాన శాఖ మంత్రి కె రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. ఇలాం టి బాంబు బెదిరింపులకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరిస్తామని తెలి పారు. ప్రయాణీకుల భద్రతపై రాజీ పడకుండా ప్రభుత్వం దీనిని పరిష్కరించడానికి ప్రయత్నిస్తోందని అన్నారు. ఇలాంటి బూటకపు బెది రింపులను ప్రసారం చేసే వారిపై నో ఫ్లై లిస్ట్‌తో సహా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అదేవిధంగా ప్రస్తుత విమానయాన భద్రతా నిబం ధనల సవరణకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు.ఇవి బూటకపు బెదిరింపులే అయినప్పటికీ వాటిని సీరియస్‌గా తీసుకోవాల్సి ఉంటుందని ఆయన ఉద్ఘాటిం చారు. బెదిరింపుల దాడి వెనుక కుట్ర దాగి ఉంటుందా అని ప్రశ్నిం చగా.. దీనిపై సమగ్ర విచారణ జరుగుతోందని మంత్రి చెప్పారు.

# యూపిలో ఆహార పదార్థాలపై ఉమ్మి

## కఠిన చర్యలకు దిగిన యోగి సర్కార్

**లక్నో,అక్టోబర్ 23 :** ఉమ్మి వేస్తూ తందూరి రోటీలు తయారు చేస్తున్న దాబా ఓనర్ ఉదంతంపై తాజాగా యోగి ఆదిత్యనాథ్ సర్కార్ ఆగ్రహం వ్యక్తం చేసింది. యూపీలో ఇలాంటి ఘటనలు ఎక్కువవుతుండటంతో అది యూపీ ప్రతిష్టను దెబ్బతీస్తుంది. తినే పదార్థాలను పాడు చేయడం, ఉమ్మి వేయడం వంటి ఘటనలు అధికంగా యూపీ నుంచే నమోదవుతున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించినట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆహారంలో ఉమ్మివేయడం లేదా ఉమ్మి కలిపిన ఆహారాన్ని వడ్డించడం వంటి సంఘటనలపై కఠిన చర్యలు తీసుకునేలా కీలక సమావేశం నిర్వహించింది. ఇటువంటి హానికర కార్యకలాపాలను నిరోధించేందుకు ప్రత్యేక ఆర్డినెన్స్ ను తయారు చేయనుంది. ఉమ్మివేయడం నిషేధం ఆర్డినెన్స్ 2024' , 'యుపి ప్రివెన్షన్ ఆఫ్ ఫుడ్ ఇన్ కాంటామినేషన్ (కన్స్యూమర్ రైట్ టు నో) ఆర్డినెన్స్ 2024' ను తీసుకురానుంది. ఈ ఆర్డినెన్స్‌ల ద్వారా ఉమ్మివేసి తయారు చేసే ఆహారం సప్లై చేసేవారిపై కఠినమైన నిబంధనలు.

# వయనాడ్ ప్రజలు నా కుటుంబ సభ్యులే..

**తిరువనంతపురం,అక్టోబరు 23 :** వయనాడ్ ప్రజలు తన కుటుంబ సభ్యులతో సమానమని కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. వయనాడ్ ఉప ఎన్నిక నేథ్యంలో ఇక్కడి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న ప్రియాంక గాంధీ బుధవారం తన నామినేషన్ దాఖలు చేశారు. అంతకుముందు భారీ ర్యాలీ నిర్వహించిన ప్రియాంక గాంధీ, అనంతరం జరిగిన బహిరంగ సభలో కాంగ్రెస్ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. తన కొత్త ప్రయాణాన్ని వయనాడ్‌లో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. తాను రాజకీయాల కోసం ఇక్కడకు రాలేదని, ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం వయనాడ్ వచ్చినట్లు తెలిపారు. రాజకీయానికంటే ఈ దేశం ముఖ్యమన్నారు. సమానత్వం కోసం కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందన్నారు. తన సోదరుడు రాహుల్ గాంధీ దేశం మొత్తం తిరిగారని, ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు, వారి సమస్యలను తెలుసు కునేందుకు దేశ వ్యాప్తంగా పర్యటించినట్లు చెప్పారు. వయనాడ్ ప్రజలకు అండగా ఉండేందకు తాను ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు. ఇక్కడి ప్రజలతో కలిసి పోరాడేందుకు, వారి సమస్యల పరిష్కారానికి వయనాడ్‌కు వచ్చినట్లు తెలిపారు. వయనాడ్ ప్రజల తరపున ప్రాతినిధ్యం వహించేందుకు ఇక్కడకు వచ్చానన్నారు. రాహుల్ మాట్లాడుతూ..తనకులాగే వయనాడ్ నుంచి తన సోదరి ప్రియాంకగాంధీని ఆశీర్వదించాలన్నారు. వయనాడ్ నుంచి అధికారికంగా ఒకరు పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తే.. మరొకరు అనధికారికంగా వయనాడ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తామన్నారు. ఇక్కడి ప్రజల కోసం తాను ఎప్పటికీ పోరాడుతూనే ఉంటానన్నారు. తన తల్లి ఇక్కడ ఉన్నారని, తండ్రి చనిపోయిన తర్వాత తన సోదరి ప్రియాంక గాంధీ అమ్మను చూసుకుంటున్నార్నారు. ప్రియాంక 17 ఏళ్ల వయసులో తండ్రిని కోల్పో యిందని, అయినప్పటికీ తమ తల్లికి తోడుగా నిలిచిందని రాహుల్ తెలిపారు. ప్రియాంకగాంధీ కుటుంబం కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధమన్నారు. వయనాడ్ ప్రజలే ప్రియాంక కుటుంబమన్నారు. ఆ కుటుంబం కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధమన్నారు. వయనాడ్ ప్రజలకు తన సోదరిని అప్పగిస్తున్నానని, ప్రియాంక గాంధీని ఇక్కడి ప్రజలే రక్షించుకోవాలన్నారు. అనధికార



ఎంపీగా తాను కూడా తరచూ వయనాడ్‌కు వస్తుంటానని రాహుల్ గాంధీ తెలిపారు. వయనాడ్ సభలో సోనియాగాంధీ, మల్లికార్జున్ ఖర్గేతో పాటు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు కాంగ్రెస్ సీనియర్ నేతలు పాల్గొన్నారు.



## డిల్లీలో గృహ, పట్టణ వ్యవహారాల స్టాండింగ్ కమిటీ
# చైర్మన్ హోదాలో సమావేశం నిర్వహించిన మాగుంట

**ఒంగోలు,అక్టోబరు 23 (ఆంధ్రపత్రిక):** డిల్లీలో పార్లమెంటు హౌస్ అనుబంధ హాలులో గృహ మరియు పట్టణ వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ హెూదాలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు, మాగుంట శ్రీనివాసులురెడ్డి రెండవ సమావేశాన్ని కమిటీ సభ్యులతో నిర్వహించారు. మొదట కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ కార్యదరి, శ్రీనివాస్ ఆర్.కటి కితల మాగుంట శ్రీనివాసులురెడ్డిని మర్యాద పూర్వకంగా కలసి అభినందనలు తెలియజేశారు. తదుపరి, ఈ సమావేశంలో కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖకు సంబంధించిన సంస్థలు మరియు కార్యాలయాల పనితీరుపై మరియు 2024-25 సంవత్సరా నికి గృహనిర్మాణ మరియు పట్టణ వ్యవహారాల శాఖ నుండి 2024-25 సంవత్సరానికి కావల సిన నిధులు మంజూరు అంశపై కమిటీ సభ్యులతో చర్చలు జరిపారు.



ఢిల్లీలో గృహనిర్మాణ మరియు పట్టణ వ్యవహారాల స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ మాగుంట శ్రీనివాసులు రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి శ్రీనివాస్ ఆర్.కటికితల శ్రీనివాస్...

## చంద్రగిరిలోని కోదండరామస్వామికి వైభవంగా
# పవిత్ర సమర్పణ





**తిరుమల, అక్టోబరు 23 (ఆంధ్రపత్రిక):** చంద్రగిరి శ్రీ కోదండ రామస్వామి వారి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం పవిత్ర సమర్పణ వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ఉదయం 6 గంటలకు స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి కొలువు నిర్వహించారు. అనంతరం సీతాలక్ష్మణ సమేత శ్రీరాములవారి ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేశారు. అక్కడ ద్వార పూజ, కుంభారాధన, హెూమం, లఘు పూర్ణాహుతి నిర్వహించారు. ఉదయం 9.30 గంటల నుండి యాగశాలలో పవిత్ర మాలలకు ఉపచారాలు నిర్వహించి ప్రదక్షిణగా సన్నిధికి వేంచేపు చేశారు. అనంతరం మూలవర్లకు, ఉత్సవర్లకు, 12 మంది ఆళ్వార్లు, శ్రీ భక్త ఆంజనేయ స్వామివారు, శ్రీ విష్వక్సేనులవారికి, శ్రీ గరుడాళ్వార్‌కు, యాగశాలలోని హెూమగుండాలకు, బలిపీఠానికి, ధ్వజస్తంభానికి, విమానగోపురానికి పవిత్రాలు సమర్పించారు.

సాయంత్రం 5.30 రాత్రి 7.30 గంటల వరకు ఆలయంలోని యాగశాలలో వైదిక కార్యక్రమాలు జరుగనున్నాయి.ఈ కార్యక్ర మంలో ఆలయ సూపరిండెంట్ జ్ఞానప్రకాష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరి, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బాధ్యతాయుతంగా పనిచేస్తా..

- ఆంధ్రప్రదేశ్ పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీటిడ్కో)-చైర్మన్‌గా వేములపాటి అజయ్ కుమార్ పదవీ బాధ్యతలు స్వీకరణ
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి హృదయపూర్వక ధన్యవాదాలు..
- నా శక్తి వంచన లేకుండా పనిచేస్తా..
- వేములపాటి అజయ్ కుమార్
- కార్యక్రమంలో పాల్గొన్న పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



**విజయవాడ, అక్టోబరు 23 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్ పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీ టిడ్కో) చైర్మన్‌గా వేములపాటి అజయ్ కుమార్ ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లోని టిడ్కో ఆఫీసులో బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పట్టణ, నగర ప్రాంతాల్లోని గూడులేని పేదలందరికీ పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వడానికి కృషి చేస్తానన్నారు. నా మీద నమ్మకంతో నాకు చాలా ప్రతిష్టాత్మకమైన పదవిని ఇచ్చినందుకు నమ్మకంగా, బాధ్యతాయుతంగా పనిచేస్తానని అందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. అదేవిధంగా ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్‌కి, మున్సిపల్ వ్యవహారాల శాఖ మంత్రి పి.నారాయణలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. పట్టణాల్లో అర్హులైన పేదలందరికీ టిడ్కో ఇళ్లు అందిస్తామన్నారు. నా శక్తి వంచన లేకుండా పనిచేస్తానని అన్నారు. మా కుటుంబ సభ్యులే నాకు బలమని తెలిపారు. వేములపల్లి అనంతరామయ్య ప్రముఖ కమ్యునిస్టు లీడర్‌గా, కార్పొరేటర్‌గా, సంఘ సంస్కర్తగా మా ప్రాంతంలో పనిచేశారన్నారు.

ఎంతో మంది పేదలకు ఆయన సేవలు అందించా రన్నారు. ఆయన ఆశీస్సులే నన్ను ఇంతవాడిని చేశాయని ఆయన తెలియ జేశారు. చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్‌ను అభినందిం చిన అనంతరం పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పదవులు పొంది న వారు స్ఫూర్తివంతంగా నిర్వహిం చాలన్నారు. ఆయన సేవలను దృష్టిలో పెట్టుకుని అవకాశాలు వచ్చాయన్నారు. గత ప్రభుత్వం 5 సంవత్సరాల్లో ఇళ్లు ఇవ్వకుండా చేసిన దుర్మార్గాలను చూశా మని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన టిడ్కో ఇళ్లు కూడా అందించకుండా తుంగ లో తొక్కరన్నారు. పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వచ్చిన వారిలో పార్ల మెంటు సభ్యులు వేమిరెడి ప్రభాకర్ రెడ్డి, శాసనసభ్యులు లోకం నాగ మాధవి, శాసనమండలి సభ్యులు పి.హరిప్రసాద్, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో వచ్చారు.

## అధికారంలో ఉండగా బాధితులు
# కనపడలేదా?



### ఏనాడైనా ఎవరినైనా పరామర్శించావా?
### జగన్ గుంటూరు పర్యటనలపై ఆలపాటి విమర్శలు

**గుంటూరు, అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):** ముఖ్యమంత్రిగా ఉండగా జగన్ ఏనాడైనా పరామర్శలకు వెళ్లారా అంటూ మాజీ మంత్రి ఆలపాటి రాజా ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గుంటూరు పర్యటనపై ఆలపాటి బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. తాడేపల్లి ప్యాలెస్ పక్కనే జరిగిన అత్యాచారంపై కనీసం నోరు మెదపలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక నీ బాబాయి హత్య గురించి నోరు విప్పలేదు. నేరపూరిత ఆలోచనలతో కూడిన పాలన జగన్ ఐదేళ్లు చేశారు. దళితులు, మైనార్టీలు, బీసీలు హత్యకు గురైనప్పుడు ఎప్పుడైనా జగన్ పరామర్శించారా. పరామర్శల పేరుతో రాజకీయంగా మాపై బురజ జల్లుతున్నారని అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వరద బాధితులకు జగన్ ప్రకటించిన రూ.కోటి సాయం ఎక్కడ ఇచ్చారని ప్రశ్నించారు. మరి ఇప్పుడైనా ప్రకటించిన రూ.10 లక్షల సాయం జగన్ ఇస్తారా అంటూ నిలదీశారు. రౌడీయిజాన్ని, అరాచకాలు, మహిళలపై దాడులకు పాల్పడిన వారిని క్షమించమమనిఅన్నారు. జగన్మోహన్ రెడ్డి జులుం ప్రదర్శించాలని చూస్తే కుదరదంటూ మాజీ మంత్రి ఆలపాటి రాజా స్పష్టం చేశారు. వైఎస్ జగన్‌పై ఎమ్మెల్యే గల్లా మాధవి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నాలుగు నెలలకే కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడ శవం దొరికితే అక్కడకు వెళ్లి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలు, ఆడపిల్లల భద్రత విషయంలో చిత్తశుద్ధితో పని చేస్తోందని వెల్లడించారు. హోంమంత్రి నేరుగా వెళ్లి బాధితులను పరామర్శించి పరిహారం అందిస్తున్నారని తెలిపారు.



## అంతర్జాతీయ ఓపెన్ చెస్ విజేతను
# అభినందించిన మంత్రి

### రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డిని కలిసిన అంతర్జాతీయ ఓపెన్ చెస్ విజేత..

**విజయవాడ,అక్టోబరు 23 (ఆంధ్రపత్రిక):** థాయిలాండ్‌లో ఈనెల జరిగిన పట్టాయ శ్రీరాచా ఓపెన్ చెస్ చాంపియన్షిప్ షిప్- 2024ను, విజయవాడకు చెందిన గ్రాండ్ మాస్టర్ ముసు నూరి రోహిత్ లలిత్ బాబ విన్నర్ ట్రోఫీ కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా విజయవాడ క్యాంపు కార్యాలయంలో క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. లలితను మంత్రి అభినందించి ప్రోత్సహించారు.

## రాష్ట్రంలో శాంతిభద్రతలు
# క్షీణించాయి

### వైసిపి పాలనలో మహిళలకు భరోసా ఇచ్చాం
### దిశ యాప్ అందుబాటులోకి తెచ్చాం..
### సహానా కుటుంబాన్ని పరామర్శించిన జగన్



**గుంటూరు,అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):** ప్రేమోన్మాది చేతిలో దాడికి గురై ప్రాణాలు కోల్పోయిన సహాన కుటుంబసభ్యులకు మాజీ సీఎం వైఎస్ జగన్ పరామర్శించారు. బుధవారం ఉదయం తాడేపల్లి నుంచి గుంటూరు జీజీహెచ్‌కు వెళ్లిన జగన్.. ముందుగా మార్చురీలో సహాన మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం సహాన కుటుంబ కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని వైఎస్సార్పీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ దిగజారిపోయిందన్నారు. ఒక దళిత చెల్లి బలై పోయిందని విమర్శించారు. వైసీపీ పాలనలో మహిళలకు భరోసా ఇచ్చామని.. దిశ యాప్ అందుబాటులోకి తెచ్చామని చెప్పుకొచ్చారు. ఎస్ఓఎస్ బటన్ నొక్కిన వెంటనే పోలీసులను పంపించే వాళ్ళమన్నారు. చేసిన వాడు మన వాడైతే ఏం చేసినా పర్వాలేదు అన్న సంకేతాలు పంపుతున్నారని విమర్శించారు. గుంటూరులో దయనీయమైన ఘటన జరిగిందని... ప్రభుత్వం ఏ విధంగా స్పందించిందో చూశామన్నారు. సీఎం చంద్రబాబుతో నిందితుడు దిగిన ఫోటోలు ఉన్నాయన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం ధర్మం పాటించాలన్నారు. బ్రెయిన్ డెడ్ అయిన తర్వాత బాధితురాలిని ఆసుపత్రిలో చేర్చారని.. ప్రభుత్వం నుంచి ఎవరూ ఎందుకు రాలేదని ప్రశ్నించారు.

# కన్నులపండువగా వెంకన్న బ్రహ్మోత్సవాలు



## శాస్త్రోక్తంగా లక్ష తులసి పూజ



**ఆత్రేయపురం,అక్టోబర్ 23 (ఆంధ్రపత్రిక):**కోనసీమ తిరుమల ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో జరుగుతున్న 12వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో మూడోరోజు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, నవనీత హారతి, సంకల్పం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, విశేషార్చన, పారత్మికోపనిశత్ పూర్వక అష్టోత్తర కళశాభిషేకం, లక్ష తులసి పూజ, ప్రధాన హెూమాలు, నీరాజన మంత్రపుష్పాలు తదితర పూజలు నిర్వహించగా సాయంత్రం స్వస్తి వచనం, ప్రధాన హెూమాలు, నవగ్రహ హెూమాలు, లక్ష్మీ వేంకటేశ్వర మూల మంత్ర పూర్వక వేంకటేశ్వర హవనం, దిగ్దేవతా బలిహరణ, నీరాజన మంత్రపుష్పాలు తదితర పూజలు జరిపించారు. ఈ పూజల్లో డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు ముదునూరి వెంకటరాజు దంపతులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే మంగళ వారం రాత్రి సరస్వతి అలంకరణలో స్వామి వారిని హంస వాహనంపై మాడవీధుల్లో కన్నులపండువగా ఊరేగించారు. ఈ గ్రామోత్సవంలో వివిధ కళారూపాలు, వాయిద్య, నృత్య ప్రదర్శనలు భక్తులను అమితంగా ఆకట్టుకున్నాయి. కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి బండారు శ్రీనివాస్ సతీ సమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవ పూజల్లో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భద్రాచలం శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానం నుంచి ఉత్సవమూర్తులతో స్వామి వారి ప్రచార రథం వాడపల్లి ఆలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా ప్రచార రథానికి మంగళ వాయిద్యాలు, కోలాట నృత్యాలతో స్వాగతం పలికారు.



## 24న టీటీడీ ట్రస్ట్ దాతల దర్శనాల జనవరి నెల
# కోటా విడుదల

**తిరుమల, అక్టోబరు 23 (ఆంధ్రపత్రిక):** టీటీడీ నిర్వహిస్తున్న వివిధ ట్రస్ట్‌లు, పథకాలతో పాటు శ్రీవేంకటేశ్వర అపన్న హృదయ పథకానికి విరాళం ఇచ్చిన దాతలకు సంబంధించి దర్శనా లు, వసతి గదుల 2025 జనవరి నెల కోటాను (వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనం తారీఖులు మినహాయించి) అక్టోబరు 24వ తేది ఉదయం 11.30 గంటలకు టీటీడీ విడుదల చేయనుంది. దాతలు ఈ విషయాన్ని గమనించి ఆన్లైన్లో బుక్ చేసుకోగలరు.

Printed and Published by KANCHARLA RAMAIAH behalf of Nageswara Rao Estates Private Limited, Printed at jagati publication Limited. Sakshi Press, Survey No 86/10, Madhurawada village, MCV Limits, Visakhapatnam - 530041, (AP), Published at D.No50-39-5/A, NORTH EXTENSION LAYOUT, NEAR STATE BANK OF HYDERABAD, SEETAMMADHARA, VISAKHAPATNAM-530013 Editor:KANCHARLA RAMAIAH.Excutive editor V.VIJAYALAKSHMI. RNI NO.10721/65 CELL 9849998069, Email:andhrapatrikadaily@gmail.com